ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

చిత్తూరు

జిల్లా వార్తలు

మంగళవారం 20 ఆగస్టు 2024





పరిశ్రమల ప్రారంభోత్సవ కార్యక్రమంలో జ్యోతి ప్రజ్వలన



చంద్రబాబుకు రాఖీ కడుతున్న మంత్రి అనిత



పరిశ్రమల నమూనాల తిలకింత



పరిశ్రమలకు ప్రారంభోత్సవం

అత్యుత్తమ ఆర్థిక మండలిగా శ్రీసిటీ

- తక్కువ వ్యయంతో ఉత్పత్తులు సాధించేందుకు కేంద్రం కావాలని ఆకాంక్షించిన సీఎం చంద్రబాబు
- 15 పరిశ్రమల ప్రారంభం... 7 యూనిట్లకు భూమిపూజ.... మరో ఐదింటి స్థాపనకు ఎంవోయూలు





శ్రీసిటీలోని వివిధ పరిశ్రమల సీఈవోల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు

తిరుపతి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): చెన్నై, కృష్ణపట్నం, తిరుపతి ప్రాంతాలకు చేరువగా వున్న శ్రీసిటీని అత్యుత్తమ ఆర్థిక మండలిగా తీర్చిదిద్దాలన్న ఆలోచన వుందని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. దానికి అనుగుణంగా శ్రీసిటీ ఐజీబీసీ గోల్డెన్ రేటింగ్ గుర్తింపు సాధించేలా కృషి చేస్తున్నామన్నారు. సోమవారం మధ్యాహ్నం శ్రీసిటీలో పర్యటించిన ఆయన సుమారు 30 ప్రతిష్ఠాత్మక పరిశ్రమలు, కంపెనీలకు చెందిన సీఈవోలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ ఇప్పటికే శ్రీసిటీలో అన్ని రకాల మౌలిక సదుపాయాలు వున్నాయని, వాటిని మరింతగా మెరుగుపరిచి అత్యంత అనుకూల నివాసయోగ్య ప్రాంతంగా మారుస్తామని ప్రకటించారు. పచ్చదనం కోసం వందశాతం వర్షపునీటి సంరక్షణకు చర్యలు తీసుకుంటామన్నారు. వీలైన మేరకు ఉత్పత్తి, రవాణా ధరలు తగ్గించాల్సి వుందని, ఆ దిశగా తమ ప్రభుత్వం అవసరమైన చర్యలు చేపడుతుందని వివరించారు. ప్రపంచవ్యాప్తంగా 30 దేశాలు పరిశ్రమలు ఏర్పాటు చేసి వ్యాపార కార్యకలాపాలు సాగిస్తున్న శ్రీసిటీ తక్కువ వ్యయంతో ఉత్పత్తులు సాధించేందుకు కేంద్రం కావాలని ఆకాంక్షించారు. శ్రీసిటీలో పారిశ్రామికవేత్తలు ఉపాధిని, సంపదను సృష్టిస్తున్నారని కొనియాడారు. పరిశ్రమల ద్వారా ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుందని, అదే విధంగా అవి సృష్టించే సంపద సంక్షేమానికి, సాధికారతకు దోహదపడుతుందన్నారు.



అగ్నిమాపక కేంద్రానికి ప్రారంభోత్సవం

పలు పరిశ్రమలకు ప్రారంభోత్సవాలు, భూమిపూజ

శ్రీసిటీలో సీఎం చంద్రబాబు సోమవారం పలు పరిశ్రమలను ప్రారంభించగా మరికొన్నింటికి భూమి పూజ చేశారు. అలాగే కొన్ని పరిశ్రమల స్థాపనకు ఒప్పందాలపై సంతకాలు చేశారు. రూ. 1570 కోట్ల పెట్టుబడులతో 8,480 మందికి ఉద్యోగావకాశాలు కల్పించే విధంగా ఏర్పాటైన 15 పరిశ్రమలను సీఎం ప్రారంభించారు. అలాగే రూ. 900 కోట్ల పెట్టుబడులతో 2,740 మందికి ఉపాధినిచ్చే ఏడు పరిశ్రమల నిర్మాణానికి భూమి పూజ చేశారు. అదే విధంగా రూ. 1213 కోట్ల పెట్టుబడులతో 4,060 మందికి ఉపాధి కల్పించే ఐదు పరిశ్రమల స్థాపనకు సంబంధిత సంస్థల ప్రతినిధులతో ఎంఓయూలపై సంతకాలు చేశారు. వీటితో పాటు శ్రీసిటీలో నూతనంగా నిర్మించిన ఫైర్ స్టేషన్‌ను ప్రారంభించిన చంద్రబాబు హైటెక్ పోలీస్ స్టేషన్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అంతకు మునుపు చంద్రబాబు విమానంలో రేణిగుంటలోని విమానాశ్రయానికి నిర్దీత సమయం కంటే అరగంట ఆలస్యంగా 12.10గంటలకు చేరుకున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పెద్దఎత్తున స్వాగతం పలికారు. అక్కడి నుంచీ హెలికాప్టర్‌లో బయల్దేరి శ్రీసిటీకి 12.40గంటలకు చేరుకున్నారు. హెలిపాడ్ వద్ద కలెక్టర్ వెంకటేశ్వర్, శ్రీసిటీ ఛైర్మన్ శ్రీనిరాజు, ఎండీ రవీంద్రసన్నారెడ్డి పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. అక్కడ నుండి బిజినెస్ సెంటర్‌కు చేరుకున్న సీఎంకు పూర్ణకుంభం, మేళతాళాలతో ఆహ్వానం పలికారు. పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్, ఇండస్ట్రీస్ డైరెక్టర్ చెరుకూరి శ్రీధర్, ఏపీఐఐసీ ఎండీ అభిషిక్త కిశోర్, డీఐజీ షిమోషీ బాజ్‌పాయ్, ఎస్పీ సుబ్బారాయుడు, ఎమ్మెల్యేలు ఆదిమూలం, ఎమ్మెల్యే విజయశ్రీ, మాజీ ఎమ్మెల్యేలు హేమలత, నెలవల సుబ్రమణ్యం, పరసా రత్నం, వరప్రసాద్, ఎస్సీవీ నాయుడు తదితరులు స్వాగతం పలికారు. శ్రీసిటీలో కార్యక్రమాలు ముగించుకుని 2.40గంటలకు హెలికాప్టర్‌లో నెల్లూరు జిల్లా సోమశిల ప్రాజెక్టు సందర్శనకు చంద్రబాబు బయల్దేరి వెళ్ళారు. అక్కడినుంచి సాయంత్రం 6.20గంటలకు రేణిగుంటకు చేరుకున్న చంద్రబాబు విజయవాడకు తిరుగుపయనమయ్యారు.



శ్రీసిటీ ప్రగతి చిత్రాల ప్రదర్శన

చంద్రబాబు తొలి పర్యటనతోనే జిల్లాకు భారీ ప్రయోజనాలు

చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశాక కుటుంబంతో కలసి నేరుగా తిరుమల వచ్చి శ్రీవారిని దర్శించుకుని వెళ్ళారు. ముఖ్యమంత్రిగా అధికారికంగా సోమవారం జిల్లాకు తొలి పర్యటన జరిపారు. అయితే తొలి పర్యటనతోనే ఆయన జిల్లాకు భారీగా ప్రయోజనాలు కల్పించి వెళ్ళడం విశేషం. నిర్మాణం పూర్తయి ఉత్పత్తి ప్రారంభించేందుకు సంసిద్ధమైన 15 పరిశ్రమలను చంద్రబాబు ప్రారంభించారు. ఈ పరిశ్రమల మొత్తం పెట్టుబడులు రూ. 1570 కోట్లు కాగా వీటి వల్ల ఏకంగా 8040 మంది యువతకు ఉద్యోగావకాశాలు లభిస్తున్నాయి. ఇందులో సింహభాగం జిల్లాకు చెందిన యువతే లబ్ధి పొందుతుండడం గమనార్హం. అలాగే 7 పరిశ్రమల నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు. వీటి పెట్టుబడుల విలువ రూ. 900 కోట్లు కాగా వీటి ద్వారా 2740 మందికి ఉద్యోగాలు లభించనున్నాయి. ఇదే వేదికగా రూ. 1213 కోట్ల పెట్టుబడుల అంచనాతో ముందుకొచ్చిన ఐదు పరిశ్రమలకు చెందిన ప్రతినిధులతో చంద్రబాబు రాష్ట్ర ప్రభుత్వం తరపున ఒప్పందాలు కుదుర్చుకుని వాటిపై సంతకాలు చేశారు. ఈ పరిశ్రమలు ఏర్పాటైతే వీటి వల్ల 4060 మందికి ఉద్యోగాలు రానున్నాయి. మొత్తంమీద చంద్రబాబు శ్రీసిటీలో గడిపిన రెండున్నర గంటల వ్యవధిలో జిల్లాకు రూ. 3683 కోట్ల పెట్టుబడులు రావడానికి, తద్వారా 15280 ఉద్యోగాల కల్పనకు కార్యరంగం సిద్ధమైంది. ఈ పరిణామం కూటమి పార్టీల శ్రేణులతో పాటు జిల్లా ప్రజలకు ప్రత్యేకించి నిరుద్యోగ యువతకు సంబరం కలిగిస్తోంది. గత ఐదేళ్ళలో పరిశ్రమలకు ముఖం వాచిన జిల్లా ఇపుడు చంద్రబాబు సీఎం అయిన కేవలం 70 రోజులకే ఇంత భారీ ఎత్తున జిల్లాకు ప్రయోజనాలు కల్పించడం ప్రజల్లో ఆశలు రేకెత్తించింది. కాగా సీఎం శ్రీసిటీ పర్యటన నేపథ్యంలో హెలిప్యాడ్ నుంచి జాతీయ రహదారి వరకు పోలీసు ఆంక్షలు అమలయ్యాయి. భారీ బందోబస్తుతో దారిలో వెళ్ళే ప్రజలను సైతం అడ్డుకున్నారు. చంద్రబాబుకు స్వాగతం పలికేందుకు తెలుగు తమ్ముళ్ళు పెద్దఎత్తున హెలిప్యాడ్ వద్దకు వచ్చేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. సూళ్లూరుపేట నియోజకవర్గంలోని మండలాల నాయకులు తడకు తరలివచ్చారు. అయితే వారిని హెలిప్యాడ్ పరిసరాలకు సైతం అనుమతించలేదు.



మొదలైన బదిలీల ప్రక్రియ

- చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య కలెక్టర్లతో కమిటీ
- ఐదేళ్లు దాటితే ఉన్నచోటు నుంచి కదలాల్సిందే
- 15 శాఖల్లో బదిలీలకు ప్రభుత్వం పచ్చజెండా
- నెలాఖరులోగా ప్రక్రియ పూర్తికి కసరత్తు
- సిఫార్సుల కోసం ఎమ్మెల్యేల వద్ద క్యూ కడుతున్న ఉద్యోగులు

చిత్తూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): కూటమి అధికారంలోకి వచ్చిన రెండు నెలలకు బదిలీలకు పచ్చ జెండా ఊపింది. ఇప్పటికే ఐఏఎస్, ఐపీఎస్‌లతో పాటు కొన్నిచోట్ల డీఎస్పీ, సీఐ, ఎస్‌ఐ, తహసీల్దార్, ఎంపీడీవోల్ని బదిలీ చేసింది. ఈ క్రమంలో అందరూ ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న మిగిలిన ప్రభుత్వ శాఖల్లోని ఉద్యోగుల బదిలీలకు ప్రభుత్వం సిద్ధమైంది. తాజాగా బదిలీల మార్గదర్శకాలను విడుదల చేసింది. ఈ నెలాఖరు వరకు బదిలీలపై నిషేధాన్ని తొలగించడంతో సోమవారం నుంచే సందడి మొదలైంది. 15 శాఖల్లో అధికారులు, ఉద్యోగుల బదిలీలు జరగనున్నాయి. ఇప్పటికే వీఆర్వో, ఆర్‌ఐ, డిప్యూటీ తహసీల్దార్ల కొన్ని బదిలీల దరఖాస్తులు కలెక్టరేట్‌కు అందాయి.

ఈ శాఖల్లోనే బదిలీలు..

అన్ని శాఖల ఉద్యోగులందర్నీ బదిలీ చేయకుండా కేవలం ప్రజాసంబంధ వ్యవహారాలకు సంబంధించిన శాఖల్లోనే బదిలీలకు కూటమి ప్రభుత్వం ఎంచుకుంది. ప్రత్యేకించి పోలీసు, రెవెన్యూ, కమర్షియల్ ట్యాక్స్, పంచాయతీరాజ్, ఎక్సైజ్, అన్ని ఇంజనీరింగ్ విభాగాల్లో కలిపి మొత్తంగా 15 శాఖల్లో మాత్రమే బదిలీలు చేయాలని నిర్ణయించారు. ఆయా శాఖల్లో వివిధ కేటగిరీల్లో పనిచేస్తున్న ఉద్యోగులను బదిలీ చేసి చాలా కాలమైంది. కొందరైతే తమకు నచ్చిన స్థానాల్లోనే ఒకేచోట ఏళ్లుగా పాతుకుపోయారు. ఇష్టానుసారంగా అవినీతికి పాల్పడ్డారు. మరికొందరు తమకు నచ్చిన పార్టీలకు అనుకూలంగా వ్యవహరిస్తూ వచ్చారు.

ముగ్గురు కలెక్టర్లతో కమిటీ

ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన బదిలీలను చేపట్టేందుకు మూడు జిల్లాల కలెక్టర్లతో ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేసింది. చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల కలెక్టర్లు సుమిత్‌కుమార్, వెంకటేశ్వర్, శ్రీధర్‌తో పాటు ఆయా జిల్లా డీఆర్వోలు కూడా ఈ కమిటీలో ఉంటారు. ఈ నెల 27, 28 తేదీల్లో ముగ్గురు కలెక్టర్లు నేరుగా, లేదా ఆన్‌లైన్ ద్వారా సమావేశమై దరఖాస్తుల్ని పరిశీలిస్తారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా నెలాఖరులోగా ప్రక్రియను పూర్తి చేసేందుకు యంత్రాంగం సన్నద్ధమవుతోంది. తిరుపతి, అన్నమయ్య జిల్లాల కలెక్టర్లు చిత్తూరు ఉమ్మడి జిల్లాలో జేసీలుగా పనిచేయడంతో ఓ అవగాహనతో బదిలీల వేగవంతానికి కృషి చేసే అవకాశముంది.

సచివాలయ ఉద్యోగుల పరిస్థితేంటి?

ఐదేళ్లు పూర్తయిన ఉద్యోగుల్ని తప్పనిసరి బదిలీ చేయాలంటూ ప్రభుత్వం మార్గదర్శకాల్లో ఉంది. సచివాలయ వ్యవస్థ ప్రారంభమై ఇంకా ఐదేళ్లు పూర్తి కాలేదు. 2019 అక్టోబరు 2వ తేదీ నుంచి సచివాలయ వ్యవస్థ ప్రారంభించారు. సుమారు మూడు నెలల పాటు తొలి విడత ఉద్యోగుల్ని నియమించుకున్నారు. 2020 చివర్లో రెండో విడత ఉద్యోగుల భర్తీ చేశారు. కానీ, ఈ ఉద్యోగుల్లో కూడా నిజమైన అవసమున్నవారు ఉన్నారు. అలాంటి వారిని కలెక్టర్లు ప్రత్యేకంగా భావించి బదిలీల్లో అవకాశం కల్పించాల్సి ఉంది.

సమస్యలుంటే నేరుగా చెప్పుకోవచ్చు



సిఫార్సు ఉంటేనే బదిలీలు చేస్తారని భావించకండి. నిజమైన సమస్య ఉంటే నేరుగా కలిసి దరఖాస్తు చేసుకోండి. పరిశీలించి బదిలీలకు అవకాశం కల్పిస్తాం. లాంగ్ స్టాండింగ్, కుటుంబ, ఆరోగ్య సమస్యలున్నవారికి బదిలీల్లో ప్రాధాన్యమిస్తున్నాం. సచివాలయ ఉద్యోగులకు ఐదేళ్లు పూర్తి కాలేదు. దీంతో మ్యూచువల్, కుటుంబ సమస్యలున్నవారినే బదిలీ చేయనున్నాం. అవకాశాన్ని బట్టి ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖల్ని పరిగణనలోకి తీసుకుంటాం.

- సుమిత్‌కుమార్, చిత్తూరు కలెక్టర్

ఎమ్మెల్యేల సిఫార్సు తప్పనిసరంటూ ప్రచారం

వైసీపీ హయాంలో తహసీల్దార్, ఎంపీడీవో, సీఐ, ఎస్‌ఐ వంటి స్థాయి అధికారుల్ని స్థానిక ఎమ్మెల్యేలు వద్దనుకుంటే క్షణాల్లో బదిలీ చేసేవారు. అవసరమైన వారిని తెచ్చుకునేవారు. కూటమి ప్రభుత్వంలో ఎమ్మెల్యేలకు ఆ పరిస్థితి లేదు. అడిగిన తహసీల్దార్, సీఐ, ఎస్‌ఐలను ఇవ్వడం లేదని జిల్లాలోని కొందరు ఎమ్మెల్యేలు తీవ్ర అసంతృప్తిలో ఉన్నారు. తాజాగా బదిలీల జీవో రావడంతో.. ఎమ్మెల్యేల సిఫార్సు తప్పనిసరనే ప్రచారం ప్రారంభమైంది. దీంతో ఆయా శాఖల్లో అధికారులు, ఉద్యోగులు ఎవరి స్థాయిలో వారు సిఫార్సు లేఖల కోసం ప్రయత్నాలు మొదలు పెట్టారు. ద్వితీయ శ్రేణి నాయకుల్ని పట్టుకుని ఎమ్మెల్యేలను కలుస్తున్నారు.

వైసీపీతో అంటకాగినవారి జాబితా సిద్ధం

గత వైసీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ నాయకులతో అంటకాగి, వారి అక్రమాలకు సహకరించిన అధికారులు, ఉద్యోగుల జాబితాలను టీడీపీ నేతలు సిద్ధం చేశారు. బదిలీల్లో వారికి ప్రాధాన్యం లేకుండా చేసేందుకు సన్నద్ధమవుతున్నారు. వైసీపీతో అంటకాగిన చాలామంది పోలీసు అధికారులకు ఇప్పటికే పోస్టింగ్ ఇవ్వలేదు. వారిలో అప్పటి ఎస్పీ రిషాంత్‌రెడ్డి, డీఎస్పీ సుధాకర్ రెడ్డి, సీఐ గంగిరెడ్డి సహా ఓ స్థాయిలో వైసీపీ కోసం పనిచేసిన డీఎస్పీ, సీఐ, ఎస్‌ఐలు ఉన్నారు. కొందర్ని పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో రిపోర్టు చేసుకోమని ఉత్తర్వులు ఇవ్వగా.. మరికొందర్ని వీఆర్‌కు పంపించారు.

ఆగని ఇసుక అక్రమ రవాణా



నగరి పట్టణ పరిధిలోని థెరణి సమీపంలో ఇసుక అక్రమ రవాణా నిరాటంకంగా కొనసాగుతోంది. నగరిలో రీచ్ లేదని అధికారులు బోర్డులు పెట్టినా ఇసుక రవాణా ఆగడంలేదని స్థానికులు అంటున్నారు. రెండు రోజులక్రితం ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు ఇసుక తరలించడానికి వీలుగాని విధంగా కందకం(ట్రెంచ్)తవ్వించినా సోమవారం ట్రాక్టర్ల యజమానులు ఇసుక రవాణాకు ప్రత్యామ్నాయ మార్గం ఎంచుకుని రవాణా చేస్తున్నారు. - నగరి

కలెక్టర్‌కు రాఖీ కట్టిన బ్రహ్మకుమారీలు



కలెక్టరేట్‌లోని నూతన సమావేశ మందిరంలో సోమవారం కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు ప్రజాహిత బ్రహ్మకుమారీస్ సభ్యురాళ్లు రాఖీలు కట్టారు. కలెక్టర్‌తో పాటు అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీ, డ్వామా పీడీ ఎన్. రాజశేఖర్‌కూ రాఖీ కట్టారు. - చిత్తూరు కలెక్టరేట్

తెప్పపై విహరించిన వేణుగోపాలుడు



వెదురుకుప్పం, ఆగస్టు 19: కార్వేటినగరంలోని రుక్మిణీసత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయ తెప్పోత్సవాల్లో భాగంగా సోమవారం తెప్పపై వేణుగోపాలస్వామి స్కంధపుష్కరిణిలో విహరించారు. భక్తులు కర్పూర హారతులు ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. భక్తులు హాజరై ఉత్సవాన్ని భక్తిశ్రద్ధలతో వీక్షించారు. సాయంత్రం ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి వేదపండితుల మంత్రోచ్చారణ, మంగళ వాయిద్యాల మధ్య తిరువీధి ఉత్సవం నిర్వహించారు. పురవీధుల్లో ఊరేగింపుగా తీసుకెళ్లారు. హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక, భక్తి, సంగీత కార్యక్రమాలు జరిగాయి. టీడీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్, ఏఈవో పార్థసారధి, సూపరింటెండెంట్ సోమశేఖర్, అర్చకులు హాజరయ్యారు.

23న గ్రామ సభలు

● డిప్యూటీ సీఎం సూచన

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 19: ఈనెల 23న అన్ని గ్రామపంచాయతీల్లో గ్రామసభలు పకడ్బందీగా నిర్వహించాలని డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ సూచించారు. సోమవారం అమరావతి నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల జడ్పీ సీఈవోలు, డ్వామా పీడీ, డీపీవోలు, ఈవోపీఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ ఏపీవోలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా రూ.వేలాది కోట్లు నిధులు వెచ్చిస్తున్నామని, ప్రతి రూపాయి బాధ్యతతో ఖర్చుచేయాలని చెప్పారు. జిల్లాస్థాయి నుంచి గ్రామస్థాయి వరకు ఉన్న అధికారులందరూ ఉపాధి పనుల నిర్వహణపై బాధ్యత తీసుకోవాలని, సోషల్ ఆడిట్ పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఇందులో కలెక్టరేట్ నుండి డ్వామా పీడీ రాజశేఖర్, జడ్పీ సీఈవో గ్లోరియా, డీపీవో లక్ష్మి, పీఆర్‌ఈఈ చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'విండో'ల్లో విధిగా సభ్యులు ఈకేవైసీ చేసుకోండి

● డీఎల్‌సీవో వనజ

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 19: జిల్లాలోని అన్ని సింగిల్ విండోల్లో సభ్యత్వ నమోదుతోపాటు ఈకేవైసీ చేసుకోవాలని డివిజనల్ కోఆపరేటివ్ ఆఫీసర్ వనజ అన్నారు. సోమవారం డీఎల్‌సీవో కార్యాలయంలో విండోల సీఈవోలు పర్సన్ ఇన్‌చార్జిలు తదితరులు పాల్గొన్నారు. ప్రతి సభ్యుడు సింగిల్ విండోల్లో త్వరలో జరిగే ఎన్నికల్లో ఓటుహక్కు కోసం తప్పనిసరిగా రూ.300 వాటాధనం చెల్లించాలని చెప్పారు. జిల్లాలో 2.47లక్షల మంది ఇప్పటివరకు సభ్యులుగా ఉండగా, వీరిలో 90వేల మంది రూ.10 మాత్రమే వాటా రుసుం కలిగి వున్నారన్నారు. వీరందరూ ఆదేశాల మేరకు అదనంగా రూ.290 వాటాధనం చెల్లించి సభ్యత్వం పొందాలని చెప్పారు. సభ్యుల వివరాలను తహసీల్దార్, మండల అభివృద్ధి అధికారులతో సమన్వయం చేసుకుని గ్రామ సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్ల సహకారంతో సేకరించాలన్నారు. ప్రస్తుతం 14 విండోలు మాత్రమే ఎరువుల వ్యాపారం కోసం లైసెన్సులు కలిగివున్నారని, మిగిలిన 23సంఘాలు సైతం వ్యవసాయ శాఖ అధికారుల నుండి లైసెన్సులు పొందాలని చెప్పారు. జీఎస్టీ సర్టిఫికెట్లు విధిగా కలిగివుండాలన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆదాయపు పన్ను శాఖకు వ్యాపార లావాదేవీలకు సంబంధించి రిటర్న్స్ ఫైల్‌చేయాలని ఆదేశించారు. కస్టమర్ సర్వీసు సెంటర్ ద్వారా ఇస్తున్న లావాదేవీల సంఖ్య మరింత పెంచాలని ఆమె సూచించారు. సమావేశంలో జిల్లా ఆడిట్ అధికారి బ్రహ్మానందం, డీసీసీబీ ప్రతినిధులు, సహకారశాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్లు, అధికారులు పాల్గొన్నారు.

ఐరాల మండలంలో గజదాడులు

ఐరాల, ఆగస్టు 19: ఐరాల మండలం బసివిరెడ్డిఇళ్లు, నయనంపల్లెలో ఏనుగుల దాడులు కొనసాగుతున్నాయి. ఆదివారం రాత్రి అటవీప్రాంతానికి సమీపంలోని పంట పొలాలపై దాడి చేసి వరి, అరటి, కొబ్బరి తోటలను ధ్వంసం చేశాయి. బసివిరెడ్డిఇళ్లకు చెందిన నరేంద్రకు చెందిన అరటి, వరి, భాస్కర్‌కు చెందిన వరి, నయనంపల్లెకు చెందిన రాజప్ప వరి, నయనంపల్లెకు చెందిన హేమాద్రి వరి పంట, జయచంద్రారెడ్డి కొబ్బరి తోటను ఏనుగులు తొక్కి నాశనం చేశాయి. ఏనుగుల దాడులలో రైతులు సుమారు లక్ష రూపాయల మేర ఆస్తి నష్టం వాటిల్లింది.



బసివిరెడ్డిఇండ్లలో ఏనుగులు తొక్కివేసిన అరటి

కూలిన చోటే.. కొత్త చిగురు..!

ఎస్వీయూలో దశాబ్దాల నాటి ఊడల మర్రి కథ ఇదీ

కూలిన చోటే.. కొత్త చిగురు వేసిన ఓ ఊడల మర్రి కథ ఇది.తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ప్రకాశం భవన్ వద్ద ఏపుగా పెరిగి ఎన్నో పశుపక్ష్యాదులకు నెలవుగా నిలిచిన సుమారు యాభై ఏళ్ళ నాటి మర్రి చెట్టు 2023 డిసెంబరు 4వ తేదీ 110 కిలోమీటర్ల వేగంతో వీచిన గాలులకు (మిచౌంగ్ తుఫాన్) కూలి పోయింది. రోడ్డుకు అడ్డంగా ఉండడంతో మర్రిచెట్టుకు పైనున్న అన్ని కొమ్మలను నరికి వేసి కాండం మాత్రం వదిలి పెట్టారు. ప్రకాశం భవన్‌కు ఆనుకొని ఉన్న టెన్నిస్, వాలీ బాల్ కోర్టులకు ఎదురుగా ఉన్న ఈ మర్రిచెట్టు కూలడంతో యూనివర్సిటీ ఇంజనీరింగ్ సిబ్బంది ఆవేదన చెందారు. ఈ మర్రిచెట్టును ఎలాగైనా మళ్ళీ నిలబెట్టాలన్న ఆలోచనతో వేర్లన్నింటినీ పూడ్చి భారీ కాండం గల మర్రి చెట్టును కొంత కాలం క్రితం నిలబెట్టారు. ఈ క్రమంలో ఇటీవల కురుస్తున్న వర్షాలకు మర్రి చెట్టు కొత్త చిగురు వేసింది. మన దేశ జాతీయ వృక్షంగా ఉన్న మర్రి చెట్టు కొత్త చిగురు వేయడానికి కారణమైన ఇంజనీరింగ్ సిబ్బంది, యూనివర్సిటీ అధికారుల చొరవ పట్ల అందరూ హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి ప్రయత్నం ద్వారా ప్రకృతి సోయగాన్ని మరింతగా పెంపొందించి అందరికీ ఆహ్లాదాన్ని పంచినట్టయ్యిందని కితాబు ఇచ్చారు.



కొత్త చిగురు వేసిన (కొత్త చిత్రం)



ఊడల మర్రి (పాత చిత్రం)

- తిరుపతి (విశ్వవిద్యాలయాలు)

ఇంకా ఎంతకాలం?

రెస్కోలో సా..గుతున్న విచారణ ● రేపు ఫిర్యాదుదారులతో భేటీ కానున్న విచారణాధికారి



కుప్పం, ఆగస్టు 19: కుప్పం రెస్కోలో గత ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమాలు, అవినీతిపై విచారణ జీడిపాకంలా సాగుతోంది. రాష్ట్ర సహకార సంఘాల అదనపు రిజిస్ట్రార్ కె.శ్రీలక్ష్మిని నిజాలు నిగ్గు తేల్చేందుకు ప్రభుత్వం నియమించినా, ఎందుకనో నత్తనడనక నడుస్తోంది. సంస్థను భ్రష్టు పట్టించింది ఎవరన్నది కళ్లెదుట కనిపిస్తూనే ఉంది. బాధ్యులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్నవారు యథావిధిగా విధుల్లో కొనసాగుతూనే ఉన్నారు. అయినా విచారణ పూర్తి కావడంలో జాప్యం జరుగుతోంది. ఎన్నికల నోటిఫికేషన్‌కు మూడు రోజుల ముందు సంస్థలోని మొత్తం 52 మంది ఉద్యోగులు పదోన్నతులు ఇచ్చుకున్నారు. మొత్తం 122 మందిని అక్రమంగా నియమించుకోవడం, ఇద్దరు అధికారులకు రాత్రికిరాత్రి నిబంధనలకు అతీతంగా రెండుమూడు పదోన్నతులు కట్టబెట్టి, ఎండీ కుర్చీలో కూర్చోబెట్టారు. కీలకమైన సీనియర్ అసిస్టెంట్ పోస్టుల్లో అస్మదీయులను కూర్చోబెట్టి అవినీతి, అక్రమాలకు దారి వేసుకున్నారు. రెస్కోలో మెటీరియల్ కొనుగోళ్లకు టెండర్లు లేకుండానే అస్మదీయులకు కాంట్రాక్టులు కట్టబెట్టారు. కూటమి అధికారంలోకి రాగానే వీటన్నింటిపై విచారణకు ఆదేశించింది. అప్పటి అవినీతిలో భాగస్వాములైన అధికారులను తొలుత విచారణాధికారులుగా నియమించినా.. వాస్తవాలు బయటపడడంతో వారిని పక్కన పెట్టారు. రాష్ట్ర సహకార సంఘాల అడిషనల్ రిజిస్ట్రార్ కె.శ్రీలక్ష్మిని విచారణాధికారిగా ప్రభుత్వం నియమించింది. ఆమె రెండుసార్లు కుప్పం వచ్చి రెస్కో కార్యాలయంలో ఫైళ్లను తనిఖీ చేయడంతోపాటు ఉద్యోగులను విచారించారు. మధ్యలో రెండుమూడుసార్లు తిరుపతినుంచి విజిలెన్స్ అధికారులు వచ్చి తనిఖీలు చేసి, ఉద్యోగులను విచారించారు. అయినా ఇంతవరకు రెస్కోలో జరిగిన అక్రమాలు, అవినీతి చర్యల గురించి ఏ అధికారీ నిర్ధారించలేదు. ఈలోగా నాడు అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న రెస్కో అధికారులు, ఉద్యోగులు రాజకీయాశ్రయం పొందడానికి ప్రయత్నాలు తీవ్రతరం చేశారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి, విచారణను వేగంగా ముగించి బాధ్యులను శిక్షించకుంటే ఈ విచారణ తంతుమీదే ప్రజలకు నమ్మకం పోయే ప్రమాదం ఉంది.

ఫిర్యాదుదారులతో రేపు విచారణ

రెస్కో అవినీతిపై చంద్రబాబు వ్యక్తిగత కార్యదర్శి పి.మనోహర్, కె.షణ్ముగం గతంలో ఫిర్యాదు చేశారు. బుధవారం జరిగే విచారణకు హాజరు కావాల్సిందిగా వీరిద్దరికీ విచారణాధికారి శ్రీలక్ష్మి నోటీసులు జారీ చేశారు. రెస్కోలో నిర్దిష్టంగా కొన్ని అవినీతి,అక్రమాలపై వీరిద్దరూ తమ ఫిర్యాదుల్లో పేర్కొన్నారు.ఆ ఫిర్యాదుల్లో కొన్ని..

- విద్యుత్తు కొనుగోళ్లకు సంబంధించి రూ.230 కోట్ల చెల్లింపులు పెండింగులో ఉండడం.
- ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ నుంచి లైసెన్సులు తీసుకోకపోవడం.
- 2021-22 ఆర్థిక సంవత్సరంలో రెస్కో రూ.5 కోట్ల నష్టాలు చవిచూడడం.
- పదవీ విరమణ చేసిన సి.సుబ్రమణ్యంను తిరిగి నిబంధనలకు వ్యతిరేకంగా ఎండీగా నియమించడం.
- అక్రమంగా ఉద్యోగుల నియామకం.. పదోన్నతులు
- ఒక ఉద్యోగికి 2020 నవంబరులో సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి కల్పించి.. మళ్లీ అదే ఉద్యోగికి 9 నెలల్లోనే రెండో పదోన్నతి ఇచ్చి జేఏవోగా చేయడం.
- ఎండీ తన కార్యాలయాన్ని దుర్వినియోగం చేసి, ఏడాది వ్యవధిలో సీనియర్ ప్రాజెక్ట్ ఇంజినీరుగా పదోన్నతి పొందడం.

'రెవెన్యూ' సమస్యలే అధికం



అర్జీని పరిశీలిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఇతర అధికారులు

చిత్తూరు, ఆగస్టు 19: కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి 113 సమస్యలపై అర్జీలు అందాయి. వీటిలో అత్యధికంగా 104 అర్జీలు రెవెన్యూ శాఖక సంబంధించినవే. మిగిలిన వాటిలో డీపీవోకు 2,డీఎస్‌వోకు 2, రిజిస్ట్రేషన్, ఐసీడీఎస్, హెచ్ఎన్ఎస్, సాంఘిక సంక్షేమశాఖలకు ఒక్కో అర్జీ వంతున అందాయి. ఈ అర్జీలను కలెక్టర్ సుమిత్‌కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీ, డీఆర్వో పుల్లయ్య, ఇతర జిల్లా అధికారులు బాధితుల నుంచి స్వీకరించారు. వారి సమస్యలను విని పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అధికారుల దృష్టికి వచ్చిన అర్జీల్లో కొన్ని..

ఓడీని రద్దుచేసి మా జిల్లాకు పంపండి



ఓడిని రద్దు చేసి అనంతపురం జిల్లాకు పంపించాలని బహుళ ప్రయోజన విస్తరణాధికారుల(ఎంపీఈవోలు) అసోసియేషన్ నేతలు కోరారు. ఈ మేరకు కలెక్టర్ సుమిత్ కుమార్‌ను కలిసి వినతిపత్రాన్ని అందించారు. డిస్ట్రిక్ కమిటీ ద్వారా ఎంపికై రోస్టర్ పాయింట్ల ఆధారంగా గత పదేళ్లగా కాంట్రాక్టు పద్ధతిపై వ్యవసాయశాఖలో పనిచేస్తున్నామని తెలిపారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో పంట విస్తీర్ణం ఎక్కువగా ఉన్నా రైతు సేవా కేంద్రాలు తక్కువగా ఉండటం, ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పంట విస్తీర్ణం తక్కువగా ఉన్నా రైతు సేవా కేంద్రాలు ఎక్కువగా ఉండటంతో అక్కడ్నుంచి తమను ఇక్కడికి బదిలీ చేశారన్నారు. తమకు రెన్యువల్ జీవో రానందున ఐదు నెలల నుంచి జీతాల్లేక ఇంటి అద్దెలు కట్టలేక, పిల్లల ఫీజులు చెల్లించలేక ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం తమను టీడీపీ సానుభూతి ఉద్యోగులుగా చూడటంతో పాటు సమయానికి జీతాలు ఇవ్వలేదన్నారు. అనంతపురం జిల్లా నుంచి ఓడీ(ఓన్లీ డిప్యుటేషన్) బేసిస్ మీద బదిలీ చేసి ఇబ్బందులకు గురి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఓడి బేసిస్‌ను రద్దు చేసి తమను అనంతపురం జిల్లాకు బదిలీ చేయడంతో పాటు పెండింగ్‌లో ఉన్న జీతాలను విడుదల చేయాలని కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ఆ సంఘ నేతలు రెడ్డి ప్రసాద్, నరేష్‌బాబు, రోజా, వాణిశ్రీ, నాగేషు తదితరులు ఉన్నారు.

పంచాయతీలో సమస్యలు పరిష్కరించండి

ఐరాల మండలం పొలకల పంచాయతీలో సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వైస్ సర్పంచ్ బత్తల రాజేంద్రనాయుడు వినతిపత్రాన్ని అందించారు. ఆధార్ సెంటర్‌ను ప్రజలకు అందుబాటులోకి తెచ్చి పొలకలలోని సచివాలయం-2లో కలపాలన్నారు. 104 వాహనాన్ని కొన్ని గ్రామాలకే పరిమితం చేశారని, మిగిలిన ప్రాంతాలకూ వెళ్లేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

ఆ నియామకంపై చర్యలు తీసుకోండి

మసీదు కమిటీ సభ్యుల అనుమతి లేకుండా చిత్తూరు నియోజకవర్గ నయాబ్ ఖాజీగా సయ్యద్ ఇమ్రాన్‌ను నియమించిన వారిపై చర్యలు తీసుకోవాలని మసీదు సంఘ నేతలు అత్తాభాయ్, ఆన్సర్‌భాయ్, జిలానీ, టైలర్ బాషా, అన్సర్, భాను, సిరాజ్ భాయ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ముస్లిం మతపెద్దలు, మసీదు కమిటీ సభ్యులు, ఎమ్మెల్యే అనుమతి లేకుండా చిత్తూరు నియోజకవర్గ ప్రభుత్వ ఖాజీగా చేసిన ఎంపిక చెల్లదన్నారు. విచారించి న్యాయం చేయాలని కోరారు.

ఎస్పీకి 31 అర్జీలు



అర్జీని పరిశీలిస్తున్న ఏఎస్పీ అరీఫుల్లా

జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి 31 మంది బాధితులు హాజరై సమస్యలను ఎస్పీ మణికంఠ దృష్టికి తీసుకొచ్చారు. సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతానని హామీ ఎస్పీ ఇచ్చారు. ఆయన దృష్టికి వచ్చిన సమస్యల్లో.. భూ తగాదాలు 12, కుటుంబ తగాదాలు 5, ఆస్తి తగాదాలు 5, డబ్బు తగాదాలు 4, వేధింపులు 3, బాలిక మిస్సింగ్ 1, ఇంటి తగాదాలు 1 ఉన్నాయి.

అదుపుతప్పి గోతిలో పడ్డ లారీ

● ఒకరి దుర్మరణం.. ఇద్దరికి తీవ్రగాయాలు ● క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్

● రెండుగంటల పాటు ఆర్తనాదాలు



మృతిచెందిన జ్యోతీశ్వర్



లారీ కేబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్‌ను ఎక్స్‌కవేటర్ సాయంతో కాపాడుతున్న అధికారులు

బంగారుపాళ్యం, ఆగస్టు 19: లారీ అదుపు తప్పి ముందుగా వెళ్తున్న కంటైనర్‌ను ఢీకొంది. ఆ తర్వాత రోడ్డు పక్కనే ఉన్న గోతిలో పడిది. ఈ ఘటనలో ఒకరు దుర్మరణం చెందగా.. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదం బంగారుపాళ్యం మండలం మొగిలి సమీపంలో సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. కర్ణాటక రాష్ట్రం శ్రీనివాసాపురం నుంచి భువనేశ్వర్‌కు టమోటా సాస్ లోడ్డుతో చిత్తూరు వైపు వెళ్తున్న లారీ.. ముందు వెళ్తున్న కంటైనర్‌ను వెనుక నుంచి ఢీకొంది. దీంతో అదుపు తప్పి జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న గోతిలో పడింది. ఆ సమయంలో మొగిలి మిట్టూరు పంచాయతీ గాండ్లపల్లికి చెందిన కరణం జ్యోతీశ్వర్ రోడ్డు పక్కనే బాటిళ్లు ఏరుకుంటున్నారు. ఇతడిపై లారీ దూసుకెళ్లడంతో జ్యోతీశ్వర్ (55) అక్కడికక్కడే మృతిచెందారు. నెల్లూరుకు చెందిన లారీ డ్రైవర్ మస్తాన్, క్లీనర్ వెంకటసుబ్బయ్య క్యాబిన్‌లో ఇరుక్కుపోయారు. క్లీనర్‌ను స్థానికులు రక్షించి చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా, డ్రైవర్ క్యాబిన్‌లోనే సుమారు రెండు గంటల పాటు ఇరుక్కుపోవడంతో ఆర్తనాదాలు చేశారు. పోలీసులు, స్థానికులు ఎక్స్‌కవేటర్‌తో చాకచక్యంగా క్యాబిన్‌ను తొలగించి, స్థానికులు ఇనుప రాడ్లతో తొలగించి డ్రైవర్‌ను బయటకు తీశారు. గాయపడిన చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కాగా, ఈ ప్రమాదంలో లారీ పూర్తిగా నుజ్జునుజ్జయ్యింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.





గాయపడ్డ లారీ డ్రైవర్ మస్తాన్ - క్లీనర్ వెంకటసుబ్బయ్య - ప్రమాదానికి గురైన కంటైనర్

అక్రమ జిలెటిన్ స్టిక్స్ స్వాధీనం

● ఇద్దరు అరెస్టు



నిందితులను మీడియాకు చూపిస్తున్న పోలీసులు

చిత్తూరు, ఆగస్టు 19: ఎలాంటి అనుమతుల్లేకుండా జిలెటిన్ స్టిక్స్‌ను నిల్వ ఉంచిన ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 76 జిలెటిన్ స్టిక్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న మరో వ్యక్తి కోసం పోలీసులు వెతుకుతున్నారు. చిత్తూరు రెండో పట్టణ సీఐ నెట్టికంఠయ్య వివరాల మేరకు.. చిత్తూరు నగరం తేనబండ సమీపంలోని బోడికొండ ప్రాంతంలో అక్రమంగా జిలెటిన్ స్టిక్స్‌ను నిల్వ ఉంచారని సమాచారం అందింది. దీంతో ఎస్ఐలు ప్రసాద్, సుగుణ, సిబ్బంది బోడికొండ ప్రాంతంలో దాడులు నిర్వహించారు. ఈ దాడిలో తమిళనాడు రాష్ట్రం తిరుత్తూరు తాలూకాకు చెందిన గోవిందన్(49), రమేష్‌లను పోలీసులు పట్టుకున్నారు. వారు అక్రమంగా నిల్వ ఉంచిన 76 జిలెటిన్ స్టిక్స్‌ను స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించారు. శివాజీ అనే మరో నిందితుడు పరారీలో ఉన్నాడని, త్వరలోనే పట్టుకుంటామని సీఐ తెలిపారు. జిలెటిన్ స్టిక్స్‌ను పట్టుకోవడంలో కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించారని సీఐ తెలిపారు.

21 నుంచి ఓటరు నమోదుకు ఇంటింటి సర్వే

● డీఆర్వో పుల్లయ్య



రాజకీయపార్టీల ప్రతినిధులతో సమావేశమైన డీఆర్వో

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 19: భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈనెల 21వ తేది నుంచి నెలరోజుల పాటు బీఎల్వోలచే ఓటరు నమోదుకోసం ఇంటింటి సర్వే చేపడుతున్నట్లు డీఆర్వో పుల్లయ్య తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఎన్ఐసీ వీడియో హాలులో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం జరిగింది. డీఆర్వో మాట్లాడుతూ 2025జనవరి 1నాటికి 18 ఏళ్ళు నిండనున్న యువతీయువకులు ఓటరుగా ఇప్పుడే నమోదు చేసుకోవచ్చన్నారు. పాత ఓటరు జాబితాలో సవరణలు కూడా చేసుకోవచ్చని తెలిపారు. అక్టోబరు 29న ముసాయిదా ఓటర్ల జాబితా, 2025 జనవరి 6న తుది ఓటర్ల జాబితా ప్రకటిస్తామని వివరించారు. ఓటరు గుర్తింపుకార్డులో ఫొటో సక్రమంగా లేకపోయినా, ఒకే కుటుంబానికి చెందిన సభ్యులకు వివిధ పోలింగ్ స్టేషన్లలో గుర్తింపు కార్డులు ఉంటే వాటి పరిష్కారానికి ఈసీఐ ఇప్పుడు అవకాశం కల్పించిందన్నారు. నవంబరు 9, 10, 23, 24 తేదీల్లో స్పెషల్ క్యాంపెయిన్లు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో డ్వామా పీడీ రాజశేఖర్, రాజకీయ పార్టీల ప్రతినిధులు అట్లూరి శ్రీనివాసులు (బీజేపీ), సురేంద్రకుమార్ (టీడీపీ), పరదేశి (కాంగ్రెస్), గంగరాజు (సీపీఐ), ఉదయ్ కుమార్ (వైసీపీ)లు పాల్గొన్నారు.

హత్య కేసులో అన్న అరెస్ట్



పోలీసుల అదుపులో ఉన్న నిందితుడు

పెద్దపంజాణి, ఆగస్టు 19: తమ్ముడిని హతమార్చిన అన్నను పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ మురళీమోహన్ తెలిపిన ప్రకారం.. పెద్దపంజాణి మండలం మట్టుగానిపల్లె గ్రామంలో ఆస్తి తగాదాలలో తమ్ముడు చెంగప్పను అన్న వెంకట్రమణ శనివారం హతమార్చిన విషయం తెలిసిందే. మృతుడి కుమార్తె ప్రభావతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో స్థానికుల సమాచారం మేరకు పలమనేరు- పుంగనూరు జాతీయ రహదారిలో తులమ్మగుడి బస్ స్టాప్ వద్ద వెంకట్రమణ ఉండగా అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు. ఈ సమావేశంలో ఎస్ఐ సహదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎంను కలిసిన టీడీపీ నేతలు



కుప్పం, ఆగస్టు 19: తిరుపతి జిల్లా శ్రీసిటీలో ముఖ్యమంత్రి చంద్రబాబును కుప్పం టీడీపీ నేతలు సోమవారం కలిశారు. మున్సిపల్ కౌన్సిలర్ జిమ్ దాము, నియోజకవర్గ మైనారిటీ సెల్ అధ్యక్షుడు జాకీర్‌లు సీఎంను మర్యాదపూర్వకంగా కలిసి స్థానిక పరి స్థితులను వివరించారు. మున్సిపాలిటీ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నందుకు ధన్య వాదాలు తెలిపారు.

బోధనా నైపుణ్యాలను పెంచేందుకే శిక్షణ



మాట్లాడుతున్న డీవైఈఓ చంద్రశేఖర్

పలమనేరు, ఆగష్టు19 : మారుతున్న పాఠ్యాంశాలకు అను గుణంగా బోధన, వృత్తి నైప ుణ్యాలను పెంచు కొనేందుకే ఉపాధ్యా యులకు స్కూల్ కాంప్లెక్సు శిక్షణా కార్య క్రమాలు నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ విద్యాశాఖ అధికారి చంద్రశేఖర్ పేర్కొన్నారు. సోమవారం పలమనేరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో జరుగుతున్న ఉపాధ్యాయుల స్కూల్ కాంప్లెక్సు శిక్షణా కార్యక్రమాలను డీవైఈఓ సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లా డుతూ ఉపాధ్యాయులు ఈ శిక్షణా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకొని విద్యార్థులకు మరింతనాణ్యమైన, మెరుగైన విద్యాబోధన చేయాలన్నారు. స్కూల్ కాంప్లెక్సు పరిధిలోని ఉపాధ్యాయులతో పాటు ఎంఈఓలు లీలారాణి, బాలసుందరం, జిల్లా ఏఎస్ఓ నారోత్తమరెడ్డి, ప్రధానోపాధ్యాయులు ఈశ్వరప్రసాద్, శంషీర్, రిసోర్సు పర్సన్లు పాల్గొన్నారు.

తెలుగులోనే నామఫలకాలు ఉండాలి



కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న తులసినాథంనాయుడు, తదితరులు

పలమనేరు, ఆగష్టు19 : పలమనేరు మున్సిపాలిటీ పరిధిలో అన్నిచోట్లా నామ ఫలకాలు తెలుగులోనే వుండేలా చర్యలు తీసుకో వాలని సోమవారం పల మనేరు మున్సిపల్ కమి షనర్ రమణారెడ్డికి తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు పి. తులసినాథం నాయుడు, సమితి సభ్యులు నరేంద్ర, హరిబాబు వినతి పత్రం అందజేశారు. ఆగస్టు 29 వ తేదీ తెలుగుభాషా దినోత్సవం లోపు అన్ని చోట్ల నామఫలకాలు తెలుగులో వుండేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. తప్పక చర్యలు తీసుకొంటామని కమిషనర్ వారికి హామీ ఇచ్చారు.

ఆగంతకులను ఎన్‌కౌంటర్ చేయాలి

పలమనేరు, ఆగస్టు19 : మహిళా డాక్టర్‌పై అఘాయిత్యానికి పాల్పడిన దుండగులను ఎన్‌కౌంటర్ చేయాలని పలమనేరులోని మానవహక్కుల సంఘం అవినీతి నిర్మూలన సంస్థ అధ్యక్షులు డీవీ మునిరత్నం డిమాండు చేశారు. సోమవారం ఆయన ఇక్కడ మాట్లాడుతూ కోల్‌కతాలో జరిగిన ఘటన సభ్య సమాజం తలదించుకొనేలా ఉందన్నారు. బాధిత కుటుంబానికి రూ.2కోట్లు నష్టపరిహారం ఇవ్వాలని, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, 5 ఎకరాల పొలం అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాల ఉత్పత్తి దారుల సంఘం నాయకులు వెంకటేష్, బిల్డింగ్ వర్కర్స్ అసోసియేషన్ నాయకులు సాంబశివ, చిరువ్యాపారుల సంఘం నాయకులు బాబు, విశ్వనాథ్ పాల్గొన్నారు.

శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలకు ఆహ్వానం



మున్సిపల్ కమిషనర్‌కు ఆహ్వానపత్రిక అందజేస్తున్న సేవాసమితి ప్రతినిధులు

కుప్పం, ఆగస్టు 19: కుప్పంలోని ప్యాలస్ సమీపంలో ఈ నెల 26వ తేదీన ప్రబోధానంద సేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహించే శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలకు నిర్వాహకులు సోమవారం పలువురు అధికారులను, ప్రముఖులను ఆహ్వానించారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావుకు, కుప్పం అర్బన్ సీఐ జీటీ.నాయుడుకు ఆహ్వానపత్రికలు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ శ్రీకృష్ణుడిని కొలువుదీర్చి, ఈ నెల 31వ తేదీన పట్టణంలో ఊరేగిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షులు, సభ్యులు కృష్ణ, నాగరాజు, శివకృష్ణ, ప్రకాశ్, కృష్ణమూర్తి, దేవరాజు, పురుషోత్తం, ఇందిర, యశస్విని, రాధా తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి విద్యుత్ లైన్ ఏర్పాటు



స్వామిని దర్శించుకున్న నాయకులు

కుప్పం రూరల్, ఆగస్టు 19: రాఖీ పౌర్ణమిని పురస్క రించుకుని కుప్పం మండలం గుడ్లనాయనిపల్లె, ఉర్లవో బనపల్లె, కృష్ణదాస నిపల్లె పంచాయతీల సరిహద్దులో అటవీ ప్రాంతంలో వెలసిన కదిరి నరసింహస్వామి ఆల యానికి సోమవారం టీడీపీ నాయకులు విద్యుత్ లైన్ ప్రారంభించారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కుప్పం మున్సిపల్ టీడీపీ అధ్యక్షుడు రాజ్‌కుమార్, మాజీ ఎంపీపీ డాక్టర్ వెంకటేశ్, లక్ష్మీపురం క్లస్టర్ ఇన్‌ఛార్జి రవి, మాజీ సర్పంచి శ్రీనివాసులు, ఆలయ ధర్మకర్త రామచంద్రప్ప, బి.బాలాజి, ప్రతాప్, కదిరప్ప, ఆలయ కమిటీ పెద్దలు, విద్యుత్తు సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి



సయ్యద్‌బాషా (ఫైల్‌ఫొటో)

కల్లూరు, ఆగస్టు 19: పులిచెర్ల మండలం కల్లూరు పంచాయతీ ఇందిరానగర్ నగర్ సమీపంలోని జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. కల్లూరుకు చెందిన ఐతేపల్లి సయ్యద్‌బాషా (48) లగేజి ఆటోలో తన కుమారుడు ఇంతియాజ్‌తో కలిసి దామల్ చెరువు నుంచి కల్లూరుకి వస్తున్నాడు. ఇందిరానగర్ సమీపంలో వెనుకనుంచి వచ్చిన కారు ఢీకొంది. ఆటో బోల్తా పడటంతో సయ్యద్‌బాషా తలకు తీవ్రగాయాలు కాగా ఇంతియాజ్ స్వల్పగాయాలతో బయటపడ్డాడు. స్థానికులు తీవ్ర గాయాలైన సయ్యద్ బాషాను ప్రైవేటు వాహనంలో పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తహసీల్దార్‌కు కూటమి నేతల సన్మానం



గుడుపల్లె, ఆగస్టు 19: కొత్తగా బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్ సీతారామ్‌ను బీజేపీ, జనసేన నాయకులు సన్మానించారు. సోమ వారం తహసీల్దార్ కార్యాలయంలో ఆయనను కలిసి మండలంలో ప్రజలు ఎదుర్కొం టున్న రెవెన్యూ సమస్యలను తెలియజేశారు. కార్యాలయానికి వచ్చే రెవెన్యూ ఫిర్యాదులను పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. వైసీపీ పాల నలో ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారని ఇప్పుడు అలా జరగకుండా చూడాలని విన్నవించారు. జనసేన మండలాధ్య క్షుడు అమీర్, బీజేపీ మండలాధ్యక్షుడు రామచంద్ర, నాయకులు హంసగిరి, మణికంఠ, గణేష్, ఆనంద్, విజయ్, క్రిష్ణమూర్తి, రామచంద్ర, రాజేష్ పాల్గొన్నారు.

వైద్యులకు రక్షణ కల్పించాలి



గంగవరం, ఆగస్టు 19: కోల్‌కతాలో వైద్యా విద్యార్థిని హత్యాచారం చేసిన నింది తులను కఠి నంగా శిక్షించాలని, దేశవ్యాప్తంగా వైద్యులకు రక్షణ కల్పిం చాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. సోమవారం గంగవరంలోని ఎంవీఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు కోల్‌కతా ఘటనకు నిరసనగా గంగ వరం నుంచి పలమనేరు వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపాల్ లక్ష్మీసుధ, వైస్ ప్రిన్సిపాల్ శ్వేత పాల్గొన్నారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



షమీర్ (ఫైల్‌ఫొటో)

సోమల, ఆగస్టు 19: సోమల మండలం కందూరుకు చెందిన షమీర్ (18) సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కందూరుకు చెందిన మదీనా షామియాన సప్లయర్స్‌లో షమీర్ దినసరి కూలీగా పని చేస్తున్నాడు. సోమల - కందూరు మార్గంలోని బాలప్పగారి పల్లె నుంచి షమీర్ ద్విచక్ర వాహనంలో స్వగ్రామానికి వస్తుండగా కందూరు నుంచి చింతలవారిపల్లెకు అతి వేగంగా వస్తున్న బొలెరో వాహనం ఢీకొంది. దీంతో షమీర్‌కు తీవ్రగాయాలయ్యాయి. కుటుంబసభ్యులు హుటాహుటిన పీలేరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. సోమల పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న సాయిచరణ్

పుంగనూరు రూరల్, ఆగస్టు19: ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. మండలంలోని ఏటవాకిలి పంచాయతీ దిగువపల్లెకు చెందిన రామచంద్రారెడ్డి కుమారుడు సాయిచరణ్(20) మనస్తాపానికి గురై పురుగుల మందు తాగి పొలాల వద్ద స్పృహకోల్పోయాడు. చుట్టుపక్కల రైతులు కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం పుంగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అతని పరిస్థితి విషమంగా ఉందని డాక్టర్ల సూచనల మేరకు మెరుగైన వైద్యం కోసం మదనపల్లెకు తరలించారు. కాగా అతడి ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

ఘనంగా శ్రావణపౌర్ణమి పూజలు



విశేషాలంకరణలో కోదండరామస్వామి

బైరెడ్డిపల్లె, ఆగస్టు 19 : బైరెడ్డిపల్లెలోని కోదండరామస్వామి ఆలయంలో సోమవారం శ్రావణ పౌర్ణమి సందర్భంగా విశేషపూజలు నిర్వహించారు. అర్చకులు తిప్పయ్యా చార్యులు స్వామివారికి అభిషేకంచేసి ప్రత్యేకపూజలు చేశారు. విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమానికి కొత్తమాచు వెంకటాచలపతిశెట్టి కుటుంబీకులు ఉభయదారులుగా వ్యవహరించారు. అలాగే స్థానిక శేషాద్రిస్వామి ఆలయంలో పౌర్ణమి పూజలు జరిగాయి. నిర్వాహకులు ధనంజయగౌడు ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. సాయంత్రం ఆలయంవద్ద కోలాటాలు, పండరి భజనలు, భక్తిగీతాలాపన కార్యక్రమాలు నిర్వహించారు. పట్నపల్లె కల్యాణవెంకన్న ఆలయం, కార్వేటికొండ ధ్యానాభిరామస్వామి ఆలయంలోనూ విశేష పూజలు జరిగాయి.

భక్తిశ్రద్ధలతో యజ్ఞోపవీతధారణ

శ్రావణపౌర్ణమి సందర్భంగా మండలంలోని శెట్టిపల్లెగ్రామంలో బాట గంగమ్మ ఆలయం వద్ద సోమవారం గాండ్లకులస్తులు భక్తిశ్రద్ధలతో సామూహిక యజ్ఞోపవీతధారణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

మల్లేశ్వరుడికి విశేష పూజలు



గుడుపల్లె, ఆగస్టు 19: మండల పరిధిలోని స్వర్ణగిరి మల్లప్ప కొండలోని వెలిసిన మల్లేశ్వరుడి ఆలయంలో సోమ వారం శావణ పౌర్ణమి సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. ఉదయం ఆలయ అర్చకులు ఉమాపతి ఆధ్వర్యంలో స్వామి వారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించి వివిధ రకాల పుష్పాలతో స్వామివారిని అలంకరిచి భక్తులకు దర్శనం కల్పించారు. ఆ తరువాత ఆలయ ఆవరణలో హోమాలు నిర్వహించారు. సాయంత్రం కొండపై దీపోత్స వాన్ని నిర్వహించారు. వందలాది భక్తులు స్వామి కొండపై గిరి ప్రదర్శన చేశారు. ఆలయ కమిటీ వారు భక్తులకు అన్నదానం చేశారు.

మేటిమంద పాఠశాలలో రాఖీ పండుగ



సోమల, ఆగస్టు 19: మండలంలోని మేటిమంద పాఠ శాలలో రాఖీ పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. హెచ్ ఎం లత విద్యా ర్థులకు రాఖీ పండుగ విశిష్టతను, అన్నా చెల్లెళ్ల అనుబంధాలను వివరించారు. అలాగే పిల్లలకు రాఖీలు కట్టించి స్వీట్లు పంపిణీ చేయించారు.

రొంపిచెర్ల: రాఖీ పండుగ సందర్భంగామండలంలోని అన్నా చెల్లెళ్లు, అక్కా తమ్ముళ్లు రాఖీలు కట్టుకున్నారు. మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. దుకాణాల వద్ద రాఖీల కొనుగోళ్ల సందడి నెలకొంది.

శాస్త్రోక్తంగా చండీహోమం



చౌడేపల్లె, ఆగస్టు19: ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయంలో అమ్మవారికి ప్రీతి కరమైన చండీ హోమాన్ని శాస్త్రోక్తంగా వేదపండితులు నిర్వహించారు. సోమవారం శ్రావణ మాస పౌర్ణమి సందర్భంగా ఆశీర్వద మండపం వద్ద కలశ స్థాపన చేసి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారి మూలమంత్రాన్ని భక్తులచే పఠింప చేసి, సహస్ర కుంకుమార్చన చేయించారు. అనంతరం గణపతి, ఆదిత్యాధి నవగ్రహ, మహాలక్ష్మీ, దుర్గా నవ చండీహోమాలను భక్తులచే ఆచరింప చేశారు. అధిక సంఖ్యలో భక్తులు హోమంలో పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఈవో ఏకాంబరం, భక్తులు పాల్గొన్నారు.

హత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి



నిరసన తెలుపుతున్న దళితసంఘ నాయకులు

పుంగనూరు ఆగస్టు19: కోల్‌కతాలో మహిళా డాక్టర్‌పై అత్యాచారం చేసి హత్యకు పాల్పడిన నింది తులను కఠినంగా శిక్షించాలని దళితసంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక అంబేద్కర్ సర్కిల్లో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా దళిత సంఘం నాయకులు అశోక్‌కుమార్, శ్రీనివాసులు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా మహిళల రక్షణకు కఠినమైన చట్టాలు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘం నాయకులు నరసింహులు, వెంకటరమణ, శంకర్, నాగరాజ, రెడ్డి, భాస్కర్, రమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరిస్తాం: చల్లా బాబు



వినతులు స్వీకరిస్తున్న చల్లా రామచంద్రారెడ్డి

రొంపిచెర్ల, ఆగస్టు19: పుంగనూరు నియోజక వర్గంలోని ప్రజల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని టీడీపీ నియోజకవర్గం ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి అన్నారు. సోమవారం రొంపిచెర్ల, సోమల, పులిచెర్ల మండలాలకు చెందిన ప్రజలు పెద్దఎత్తున ఆయన ఇంటి వద్దకు వచ్చి వారి సమస్యలపై వినతులు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అందరి సమస్యలూ పరిష్కరిస్తామన్నారు. పలువురు ఆయనకు రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు గౌస్‌పీర్‌ఖాన్, నాగిశెట్టి నాగరాజ, ఇమ్రాన్‌ఖాన్, కుమార్ రెడ్డి, ఓబులేశ్వరరెడ్డి, రాజశేఖర్, తులసీరాం, కరీముల్లా, వరదం జనార్ధన్ పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే గ్రామపంచాయతీల అభివృద్ధి



అవగాహన కల్పిస్తున్న రిసోర్స్‌పర్సన్

బైరెడ్డిపల్లె, ఆగస్టు 19 : సమష్టి కృషితోనే గ్రామపంచాయతీల అభివృద్ధి జరుగుతుందని బైరెడ్డిపల్లె ఎంపీడీవో రాజేంద్రబాలాజీ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పారిశుధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణ, పంచాయతీల అభివృద్ధి ప్రణాళిక పరిశీలన, వీధి దీపాలు తదితర అంశాలపై సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లకు మూడురోజుల శిక్షణ కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ అందరూ కలసికట్టుగా పంచాయతీలను ప్రగతిపథంలో తీసుకెళ్లడానికి కృషిచేయాలన్నారు. పంచాయతీల నిర్వహణకు సంబంధించిన పలు అంశాలపై రిసోర్స్‌పర్సన్లు సద్గుణ, మహేష్ వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో సురేష్‌బాబు, సర్పంచులు, కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు తయారు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో తాజ్ మస్రూర్

గుడుపల్లె, ఆగస్టు 19: గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు తయారు చేయాలని ఎంపీడీవో తాజ్ మస్రూర్ కార్యదర్శులకు సూచించారు. సోమవారం శ్రీ శక్తి భవనంలో సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఎంపీడీవో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలు అభివృద్ధి చెందాలంటే సర్పంచ్, కార్యదర్శుల కీలకమన్నారు. గ్రామాల్లో పారశుధ్యం, వీధి లైట్లు నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు. ఉపాధిహామీ కూలీలకు పనులు అడిగిన వెంటనే కేటాయించాలన్నారు. పంచాయతీ నిధులను సక్రమంగా గ్రామాల అభివృద్ధి కోసం ఖర్చుచేయాలని కోరారు. కుప్పం మండల విస్తరణ అధికారి విజయ దత్, కార్యదర్శి నరహింహులు శిక్షణ అందించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి విస్తరణ అధికారి శివశంకర్, సీనియర్ సహాయకులు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

యామిగానిపల్లెలో నీటి సమస్య పరిష్కరించాలి



ధర్నా చేస్తున్న గ్రామస్తులు

గుడుపల్లె, ఆగస్టు 19: యామిగానిపల్లెలో నెల కొన్న తాగునీటి సమస్య పరిష్కరిం చాలని గ్రామస్తులు సోమవారం రోడ్డుపై ధర్నా నిర్వ హించారు. ఈ సంద ర్భంగా వారు మాట్లా డుతూ నెలగా తాగునీటి నీటి సమస్య నెలకొంద న్నారు. అధికారులకు పలు మార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేద న్నారు. దీంతో నీటి కోసం వ్యవసాయ బోర్లను ఆశ్రయి స్తున్నామని విచారం వ్యక్తం చేశారు. ధర్నా విషయం తెలుసుకొన్న సర్పంచ్ శ్రీనివాసులు అక్కడకు చేరుకొని గ్రామస్తులతో మాట్లాడారు. నీటి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

గ్రామ పంచాయతీల అభ్యున్నతికి కృషి

వి.కోట, ఆగస్టు 19: గ్రామ పంచాయతీల అభ్యున్నతికి ప్రతి సర్పంచ్ కృషి చేయాలని జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు అన్నారు. సోమవారం వి.కోట మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచుల విధులు, బాధ్యతలపై మూడు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. గ్రామాల్లో పారిశుధ్యం, వీధి దీపాల నిర్వహణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు డా.తమీంఖాన్, లక్ష్మణ్‌రెడ్డి, ఎంపీడీవో మహ్మద్‌రఫీ తదితరులు పాల్గొన్నారు.

కాశీ విశ్వేశ్వరుడికి పౌర్ణమి పూజలు



ఆలయ వెలుపల భక్తుల కోలాహలం (ఇన్‌సెట్లో) విశేష అలంకరణలో అన్నపూర్ణదేవి, కాశీ విశ్వేశ్వర స్వామి,

రామకుప్పం, ఆగస్టు 19: రామకుప్పంలోని అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో సోమవారం కార్తీక పౌర్ణమి పూజలు వైభవంగా జరిగాయి. రాత్రి 7 గంటలకు స్వామి వారికి ఉదయం అమ్మవారికి, స్వామివారికి రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం పంచామృతాభిషేక పూజలు నిర్వహించి విశేష అలంకరణలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో భక్తులు దర్శనం చేసుకున్నారు. కొబ్బరి కాయలు కొట్టి కర్పూర హారతులు ఇచ్చారు. నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. పూజల అనంతరం పార్వతీ పరమేశ్వరుల ఉత్సవర్లను మేళతాళాలు, డప్పుల హోరు మధ్య నాలుగు మాడ వీధుల్లో ఊరేగించారు. భక్తులు అడుగడుగునా కొబ్బరి కాయలు కొట్టి కర్పూర హారతులు సమర్పించారు.

రేపు టెన్నీకాయిట్ జిల్లా జట్టు ఎంపిక

సోమల, ఆగస్టు 19: సోమల ఉన్నత పాఠశాలలో ఈ నెల 21న టెన్నీకాయిట్ సబ్ జూనియర్స్ జిల్లా జట్టును ఎంపిక చేయనున్నారు. చిత్తూరు జిల్లా టెన్నీకాయిట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడాకారుల ఎంపిక జరుగుతుంది. ఈ సందర్భంగా టెన్నీకాయిట్ అసోసియేషన్ కార్యదర్శి చిన్నప్ప మాట్లాడుతూ సెప్టెంబరు 14, 15, 16 తేదీలలో శ్రీకాకుళం జిల్లా పలాసలో అంతర్ జిల్లాల పోటీల్లో పాల్గొనేందు జట్టును ఎంపిక చేస్తామని వివరించారు. 2010 ఏప్రిల్ 1వ తేదీ అనంతరం జన్మించిన క్రీడాకారులు మాత్రమే అర్హులని వివరించారు. హాజరయ్యేవారు హెచ్‌ఎంలు జారీ చేసిన డేట్ ఆఫ్‌బర్త్ సర్టిఫికెట్, ఆధార్ కార్డ్ తప్పక తీసుకురావాలని చెప్పారు. క్రీడాకారులు తమ సొంత ఖర్చులతో పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని తెలియజేశారు. వివరాలకు 7780250922కు సంప్రదించాలని పీడీ కరుణానిధి తెలిపారు.

భక్తిశ్రద్ధలతో సత్యనారాయణ వ్రతం



కల్లూరు, ఆగస్టు 19: పులిచెర్ల మండలం దేవళంపేటలో కొలువైన లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో సోమవారం సామూహిక సత్య నాయణస్వామి వ్రతం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. శ్రావణ మాసం పౌర్ణమి సందర్భంగా ఆలయంలో ఉదయం స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేకపూజలు నిర్వహించారు. వ్రతంలో పాల్గొన్న దంపతులకు అర్చకులు అనంతకుమారాచార్యులు తీర్థప్రసాదాలు అందజేశారు.

ప్రత్యేక అలంకరణలో కళ్యాణ వెంకటరమణుడు



పుంగనూరు రూరల్, ఆగస్టు19: పట్టణంలోని కోనేటి వద్ద వెలసిన కళ్యాణ వెంకటమణస్వామి ఆలయంలో పౌర్ణమిపూజలు నిర్వహించారు. అర్చకులు వేకువజామున సుప్రభాతంతో స్వామి వారిని మేల్కొలిపి ప్రత్యేక పూజలు, హోమాలు, అభిషేకాలు, అర్చనలు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. శ్రావణ శనివారం కావడంతో భక్తులు ఉపవాసాలతో స్వామివారిని దర్శించుకున్నారు. అలాగే మండలంలోని ఏడూరు. గూడూరుపల్లె గ్రామాల వద్ద వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయాల్లో హోమాలు, ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

పెద్దగడిదేశిలో రామకోటి

పుంగనూరు రూరల్, ఆగస్టు19: మండలంలోని పాళ్యంపల్లె పంచాయతీ పెద్దగడిదేశి గ్రామంలోని రామాలయం ముందు రామకోటి నిర్వహించారు. సోమవారం ఉదయం నుంచి మంగళవారం ఉదయం వరకు రామకోటి జపం చేయనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏటా గ్రామంలో రామకోటి జపం చేయడం వల్ల వర్షాలు బాగా కురిసి పంటలు బాగా పడుతాయని, ప్రజలు సుఖసంతోషాలతో ఉంటారనే నమ్మకంతో రామకోటి నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సీఐ శ్రీనివాసులుకు ఘన సన్మానం



పుంగనూరు, ఆగస్టు19: పుంగనూరు అర్బన్ సీఐగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసులును పట్టణంలోని ప్రజా సంఘాలు, దళితసంఘాలు, టీడీపీ, ఎస్‌డీపీఐ నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకురావాలని, దళారులను ఆశ్రయించవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సుహేల్‌బాషా, రామయ్య, గంగులప్ప, రమణ, సిద్ధప్ప, మణి, దళిత సంఘనాయకులు అశోక్‌కుమార్, శ్రీనివాసులు, నరసింహులు, భాస్కర్, రాయల్‌పీపుల్ ఫ్రంట్ టీం సభ్యులు జనార్దన్, హేమంత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రికార్డులు సక్రమంగా నమోదు చేయాలి

సోమల, ఆగస్టు 19: విద్యార్థులకు మెరుగైన బోధనతో పాటు ఆన్‌లైన్‌లో రికార్డులు సక్రమంగా నమోదు చేయాలని ఎంఈవో శివరత్న సూచించారు. సోమవారం కందూరు హైస్కూల్లో సీఆర్సీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ విద్యార్థుల బుక్ హాజరు నమోదులో, యాప్ హాజరు నమోదులో వ్యత్యాసం లేకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. వర్షాకాలంలో విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి, వైద్య పరీక్షలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఈ సమావేశంలో క్లస్టర్ కార్యదర్శి రాజశేఖర్, హెచ్‌ఎం లక్ష్మీపతి, క్లస్టర్ స్థాయి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆంజనేయుడి సేవలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి



సదుం, ఆగస్టు19: మండలంలోని జోగివారిపల్లె పంచాయతీ బత్తులవారిపల్లెలో నూతనంగా నిర్మించిన కార్యసిద్ధి ఆంజనేయస్వామి ఆలయాన్ని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సోమవారం సందర్శించారు. ఆలయ నిర్వాహకులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి రాత్రి స్వామివారిని ఊరేగించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వృద్ధుడి ఆత్మహత్య

సోమల, ఆగస్టు 19: కుటుంబ ఆర్థిక పరిస్థితులు సరిగా లేక వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. సోమల పోలీసుల కథనం మేరకు.. వల్లిగట్ల పంచాయతీ జమాలగుట్టకు చెందిన రమణయ్య(81) వృద్ధాప్య సమస్యలతో బాధపడు తున్నాడు. అదేసమయంలో ఆర్థిక సమస్యలున్నాయి. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో పురుగుల మందు తాగాడు. ఆటో డ్రైవర్ అయిన ఆయన కుమారుడు గంగాధరం గుర్తించి కలికిరి ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

శాస్త్రోక్తంగా జంధ్యాల పండుగ



జంధ్యాలు మార్చుకుంటున్న క్షత్రియ వంశస్థులు

పాలసముద్రం, ఆగస్టు 19: గురుపౌర్ణమిని పురస్కరించుకుని రాచపాళ్యంలో క్షత్రియ వంశస్థులు సోమవారం జంధ్యాల పండుగ నిర్వహించారు. బ్రాహ్మణులు హోమాన్ని నిర్వహించి, క్షత్రియ కులస్థులంతా జంజాలు మార్చుకున్నారు.

చిత్తూరు కల్చరల్ : శ్రావణ పౌర్ణమి పర్వదినాన్ని సోమవారం నగరంలోని హిందువులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయాన్నే నగరంలోని గంగినేని చెరువు, కట్టమంచి చెరువు, నీవానది, కలువగుంట ఎన్టీఆర్ జలాధయాల్లో స్నానాలు చేసి సూర్య భగవానునికి అర్ఘ ప్రదానం చేసి, పాత జంధ్యాలను(యజ్ఞోపతీతాలను) విసర్జించారు. అనంతరం గాయత్రి దేవి ఉపాసనలు చేసి నూతన జంధ్యాలను ధరించారు. ఈ మేరకు నగరంలోని అన్నీ ఆలయాల్లో బ్రాహ్మణ బాలురలకు వడుగులు నిర్వహించి నూతన యజ్ఞోపతీతాలు ధరింపచేసారు. అదే విధంగా గిరింపేట శంకర బ్రాహ్మణ సేవాసమితి, సుగుణేంద్ర తీర్థ మూల సన్నిధానం, జెండామాను వీధి, బీమారావు సత్రం, రాఘవేంద్ర స్వామి ఆలయాల్లో జంధ్యాల పండుగ నిర్వహించారు.

చెరుకుతోట దగ్ధం



పాలసముద్రం, ఆగస్టు 19: చెరుకు తోట దగ్ధమై రైతుకు సుమారు రూ.లక్ష ఆస్తి నష్టం జరిగింది. సోమవారం మధ్యాహ్నం పాలసముద్రం పంచాయతీ నిశ్శింకాపురం గ్రామానికి చెందిన వెంకటేశులు నాయుడి చెరుకుతోటలో మంటలు చెలరేగాయి. చుట్టుపక్కల ఉన్న రైతులు చుట్టుముట్టి, మంటలను అదుపుచేయడానికి ప్రయత్నించారు. అప్పటికే ఎకరం చెరుకుతోట కాలిపోయింది. చెరుకుతోట మీదుగా విద్యుత్ లైను ఉంది. తహసీల్దార్ అరుణకుమారికి ఫిర్యాదు చేయడంతో ఆమె సూచన మేరకు ఏవో డిల్లీ ప్రసాద్, వీఆర్వో ఆనంద నాయుడు దగ్ధమైన చెరుకుతోటను పరిశీలించారు. విద్యుత్ వైర్లు ఎక్కడా రాపిడికి గురికాలేదని, ఇది ప్రత్యర్థి పార్టీ వారి పనే అని రైతు వెంకటేశులు నాయుడు, అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

గంగాధరనెల్లూరు అభివృద్ధికి సహకరించండి



పాలసముద్రం, ఆగస్టు 19: గంగాధరనెల్లూరు నియోజకవర్గం అభివృద్ధికి నిధులు మంజూరు చేసి సహకరించాలని రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి భీమనేని చిట్టిబాబు నాయుడు కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన అమరావతిలో ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌ను కలిసినట్లు భీమనేని తెలిపారు. మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు.

గర్భిణులకు దుస్తులు, ప్రసాదాల పంపిణీ



చిత్తూరు కల్చరల్, ఆగస్టు 19: గిరింపేట సత్యసాయి సంస్థాన్‌లో సోమవారం సత్యసాయి మాస మహిళాదినోత్సవం జరిపారు. సత్యసాయి మహిళా విభాగం ఆధ్వర్యంలో బాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించి చిత్తూరు ప్రభుత్వసుపత్రి ప్రసూతి వార్డులో గర్భిణులకు, పురిటి చిన్నారులకు నూతన వస్త్రాలు, స్వామివారి ప్రసాదాలు పంపిణీ చేశారు. పేదలకు అన్నదానం చేసారు. శ్రావణ పౌర్ణమి సందర్భంగా, నగర సంకీర్తన, ఇంటింటా భజన, బాబాకు పల్లకి సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి సేవాసమితి జిల్లా, నగర కమిటీలు, సత్యసాయి మహిళా విభాగం, భజనమండలి, బాలవికాస్ సభ్యులు పాల్గొన్నారు.

బూచివానత్తంలో తాగునీటి సమస్య పరిష్కారం

విజయపురం, ఆగస్టు 19: మండలంలోని బూచివానత్తంలో సోమవారం తాగునీటి పరిష్కారం అయిందని గ్రామస్తులు తెలిపారు. మూడు రోజుల క్రితం మోటారు మరమ్మతులకు గురి కావడంతో సర్పంచ్ గోపాల్ స్పందించి మరమ్మతు చేయించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

కాణిపాకంలో సత్యనారాయణ స్వామి వ్రతం



ఐరాల(కాణిపాకం), ఆగస్టు 19: వరసిద్ధుడి ఆలయానికి అనుబంధ ఆలయమైన వరదరాజ స్వామి ఆలయంలో సోమవారం ఉదయం సత్యనారాయణస్వామి వ్రతాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం మూల విరాట్‌కు అభిషేకం నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో సత్యనారాయణస్వామి చిత్రపటాన్ని ఉంచి వ్రతాన్ని నిర్వహింపజేశారు. సాయంత్రం స్వామి ఊరేగింపు నిర్వహించారు.


గ్రామాల అభివృద్ధిపై శిక్షణ

తవణంపల్లె, ఆగస్టు 19: గ్రామ పంచాయతీల అభివృద్ధిపై సర్పంచ్‌లు, కార్యదర్శులకు సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. రీసోర్సు పర్సన్లు హరిప్రసాద్‌రెడ్డి, దుర్గాప్రసాద్‌లు పంచాయతీ విధులు, అధికారాలు, చట్టాలపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ, బృందావనాలు నిర్వహణ, వీధి దీపాలు, ఇందన పొదుపు పై శిక్షణ ఇచ్చారు. ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్, ఎంపీపీ పట్నం ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

పెనుమూరు : గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయం అవసరమని ఎంపీడీవో నీలకంఠేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధుల్లో 50 శాతం శానిటేషన్ పనులకు ఖర్చు చేయాలని సూచించారు. ఈవోపీఆర్డీ మహేశ్వర్‌రెడ్డి, శిక్షణా అధికారులు వెదురుకుప్పం ఈవోపీఆర్డీ పురుషోత్తం, నిర్మాలాదేవి పాల్గొన్నారు.

వెదురుకుప్పం : ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. మూడు రోజులపాటు జరిగే శిక్షణ తరగతులను ఎంపీడీవో ప్రేమ్‌రాజ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సూచనలు ఇచ్చారు. ఈవోపీఆర్డీ పురుషోత్తం హాజరయ్యారు.

వరసిద్ధుడి సేవలో తెలంగాణ రాష్ట్ర ఉపలోకాయుక్త



ఐరాల(కాణిపాకం(, ఆగస్టు 19: తెలంగాణ రాష్ట్ర ఉపలోకాయుక్త వి.నిరంజన్‌రావు సోమవారం కాణిపాక వరసిద్ధుడిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వారిని సూపరింటెండెంట్ వాసు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ విఘ్నేష్, తవణంపల్లె తహసీల్దార్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఫొటోగ్రఫీ దినోత్సవం



ఫొటోగ్రఫీ పితామహుడు దాగురేకు నివాళి అర్పిస్తున్న ఫొటోగ్రాఫర్లు

నగరి ఆగస్టు 19: పట్టణ పరిధిలోని ఫొటోగ్రాఫర్లు నగరి ఫొటో అసోసియేషన్ కార్యాలయం వద్ద సోమవారం 185వ ఫొటోగ్రఫీ దినోత్సవం జరుపుకొన్నారు. ఫొటోగ్రఫీ పితామహుడు దాగురే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఫొటోగ్రాఫర్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నాదొరై, వర్కింగ్ ప్రెసిడెంట్ శంకర్ మాట్లాడుతూ ప్రకృతి అందాలను ఫోటోలలో బంధించడం, మనిషి తన ప్రతిరూపాన్ని రకరకాల విన్యాసాలలో చిత్రీకరించుకోవడానికి ఫొటోగ్రఫీ ఎంతో దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి రవీంద్రబాబు, సంయుక్త కార్యదర్శి శివకుమార్, సభ్యులు పాల్గొన్నారు.

దాసుకుప్పం-నగరి బస్సును నడపండి

నింద్ర, ఆగస్టు 19: దాసుకుప్పం-నగరి బస్సు సర్వీసును తిరిగి నడపాలని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌కు అగరం ప్రజలు వినతిపత్రం అందజేశారు. గతంలో పుత్తూరు, సత్యవేడు డిపోలకు చెందిన బస్సులు దాసుకుప్పం-నగరి మార్గాన నడిచేవన్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక బస్సు సర్వీసును రద్దు చేయడంతో ఇబ్బందిగా ఉందన్నారు. తిరిగి బస్సు సర్వీసును పునరుద్ధరించాలన్నారు.

22న దక్షిణామూర్తి ఆలయ కుంభాభిషేకం

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 19: గిరింపేట సీబీ. రోడ్డు చెంగల్‌రాయకొండ వినాయక ఆలయంలో దక్షిణామూర్తి ఉపాలయ మహా కుంభాభిషేకం నిర్వహిస్తున్నట్లు సోమవారం ఆలయ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో చిత్తూరు ఎమ్మెల్యేతో పాటు పలువురు నగర ప్రముఖులు పాల్గొననున్నట్లు ఆయన తెలియజేశారు.

పీవీకేఎన్‌కు ఐఎస్ఓ గుర్తింపు



చిత్తూరు(సెంట్రల్), ఆగస్టు19: పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఐఎస్ఓ గుర్తింపు లభించింది.బెస్టు ఎడ్యు కేషనల్ సర్వీసు సెంటర్, గ్రీనరీ అండ్ ఎన్విరాన్‌మెంట్ ప్రమోషన్, ఎనర్జీ సేవింగ్ ప్రాక్టిసిస్ అనే మూడు అంశాల ప్రమాణికంగా అంతర్జాతీయ సంస్థ నుంచి ఐఎస్ఓ గుర్తింపు లభించినట్లు ప్రిన్సిపాల్ జీవన జ్యోతి తెలిపారు. ఐఎస్ఓ ధ్రువీకరణ పత్రాన్ని ఎస్వీయూ రిజిస్ట్రార్ ఎం.భూపతి నాయుడు ప్రిన్సిపాల్‌కు అందజేశారు

కర్తవ్య బోధనే భగవద్గీత సారాంశం

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 19: జీవితంలో ఎదురయ్యే పలు సమస్యలు, సవాళ్ళను ఎదుర్కొని ముందుకు సాగడమే భగవద్గీత సారాంశం అన్ని ప్రముఖ ప్రవచనకర్త స్వామిని శ్రేయానంద సరస్వతి చిన్మాయానంద తెలిపారు. వేలూరు రోడ్డులోని సద్గురు సేవా ఆశ్రమంలో రెండు రోజులుగా గీతాజ్ఞాన యజ్ఞం నిర్వహిస్తున్నారు. ఆమె కేసేపనిషత్తు, జ్ఞానయోగం వివరించారు. ఈ కార్యక్రమంలో పరబ్రహ్మ స్వామి, బాబునాయుడు, కేసవులు, రఘుపతి, భక్తులు పాల్గొన్నారు.

25న నేత్ర వైద్య శిబిరం

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 19: చిత్తూరు రాములగుడి వీధి జైన్ పార్థనామందిరంలో ఈనెల 25న ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు జైన్ సంఘం అధ్యక్షుడు సుభాష్ జైన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే ఆదివారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కంటి రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలతో పాటు మందులు, కంటి అద్దాలు పంపిణీ చేయనున్నామని ఆయన తెలియజేశారు.

విద్యా సామగ్రి పంపిణీ

విజయపురం, ఆగస్టు 19: మండలంలోని ఇష్టకామేశపురం ప్రాథమిక పాఠశాలలో సోమవారం రిటైర్డు ప్రధానోపాధ్యాయుడు చంద్రయ్య విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేశారు. ఒకటి నుంచి ఐదు వరకు చదువుతున్న విద్యార్థులకు పెన్నులు, పెన్సిల్, నోటుపుస్తకాలు వితరణగా అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఉదయమ్మ, అంగన్‌వాడీ కార్యకర్త రోజా పాల్గొన్నారు.

పీపీపీ వేదికకు ఎనిమిది ఫిర్యాదులు

చిత్తూరు, ఆగస్టు 19: చిత్తూరు నగరపాలక కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార(పీపీపీ) వేదిక కార్యక్రమంలో ఎనిమిది వినతులు అందినట్లు సహాయ కమిషనర్ రామకృష్ణుడు తెలిపారు. సోమవారం కార్యాలయ ఆవరణలో ప్రజలనుంచి ఆయన వినతిపత్రాలను స్వీకరించారు. ఇంజనీరింగ్‌కు 6, టిడ్కోకు 1, టౌన్‌ప్లానింగ్‌కు 1 చొప్పున మొత్తం 8 అర్జీలు అందినట్లు తెలిపారు. ఎంహెచ్‌వో అనిల్‌కుమార్ నాయక్, మేనేజర్ వర్మ, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో కార్పెంటర్ మృతి



సంపత్(ఫైల్)

యాదమరి, ఆగస్టు 19: రోడ్డు ప్రమాదంలో ఓ కార్పెంటర్ మృతి చెందాడు. కోణాపల్లెకు చెందిన ధనకోటి కుమారుడు సంపత్(30) కార్పెంటర్‌గా పనిచేసేవాడు. సోమవారం యాదమరి నుంచి చిత్తూరు వైపు ద్విచక్రవాహనంలో వస్తుండగా ఎదురుగా వస్తున్న ఆయిల్ ట్యాంకర్ బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో సంపత్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు ఏఎస్ఐ దామోదర్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దక్షిణ రైల్వే కన్సల్టేటివ్ సభ్యుడిగా వెంకటరమణ



నింద్ర, ఆగస్టు 19: నింద్ర గ్రామానికి చెందిన వెంకటరమణ దక్షిణ రైల్వే కన్సల్టేటివ్ కమిటీ సభ్యుడుగా నియమితులయ్యారు. సోమవారం నగరి రైల్వేస్టేషన్ మాస్టర్ అస్నిక్ కుమార్ నుంచి మెంబర్‌షిప్ కార్డును వెంకటరమణ అందుకున్నారు. వెంకటరమణ బీజేపీలో నగరి సోషియల్ మీడియా కన్వీనర్‌గా పనిచేశారు.

22న సంకటహర గణపతి వ్రతం

ఐరాల(కాణిపాకం), ఆగస్టు 19: స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో ఈనెల 22న సంకటహర గణపతి వ్రతాన్ని నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఈవో వాణి తెలిపారు. ఈ వ్రతాన్ని ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 5 గంటల నుంచి 6 గంటల వరకు నిర్వహించనున్నట్లు ఆమె వివరించారు. అనంతరం రాత్రి 7 గంటలకు స్వామి ఉత్సవ విగ్రహాలను స్వర్ణ రథంపై ఆలయ మాడవీధులలో ఊరేగించనున్నట్లు ఆమె తెలిపారు.

ఈకేవైసీ చేసుకుంటేనే రుణాలు

● సీఈవో సెల్వం

గుడిపాల, ఆగస్టు 19: సొసైటీలో ఈకేవైసీ చేసుకుంటేనే రుణాలు కానీ, ప్రభుత్వ పథకాల కానీ వర్తిస్తాయని సింగిల్ విండో సీఈవో పట్టాభి అన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సహకార సంఘాల కంప్యూటరీకరణలో భాగంగా సొసైటీలో సభ్యులు, రుణాలు పొందిన లబ్ధిదారులు ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. ఈకేవైసీతో రుణమాఫీ, ప్రమాదబీమా, వడ్డీ రాయితీ పొందవచ్చన్నారు.

కాణిపాకం ఆలయ సీఎఫ్‌వోగా నాగేశ్వరరావు



ఐరాల(కాణిపాకం), ఆగస్టు 19: కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ సీఎఫ్‌వోగా నాగేశ్వరరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన 2018 నుంచి 2021 వరకు విధులు నిర్వహించారు. ప్రస్తుతం ఏడాదిపాటు సీఎఫ్‌వోగా పని చేయుటకు ఉత్తర్వులు వెలువడ్డాయి.

ఘనంగా శ్రావణ పౌర్ణమి వేడుకలు



అర్ధగిరిలో సుదర్శన హోమం, బాలగురునాధీశ్వరస్వామి ఆలయంలో పూజలు, శేషవాహనంపై స్వామి ఊరేగింపు, ఉత్సవ మూర్తులకు క్షీరాభిషేకం

తవణంపల్లె, ఆగస్టు19: ప్రముఖ పుణ్యక్షేత్రం అర్ధగిరి వీరాంజనేయస్వామి ఆలయంలో సోమవారం పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రధానార్చకులు వేణుగోపాలాచార్యులు ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, సుదర్శన హోమం నిర్వహించారు. సాయంత్రం స్వామి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి ప్రాకారోత్సవం నిర్వహించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు, అన్నదానం నిర్వహించారు.

పాలసముద్రం : మండలంలోని రాచపాళ్యంలో వున్న బాలగురునాధీశ్వర ఆలయంలో సోమవారం గురుపౌర్ణమిని పురస్కరించుకుని అర్చకస్వాములు ఆలయ ప్రాంగణంలో కలశాలు ఏర్పాటు చేసి రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం కలశాల్లో వున్న తీర్థంతో మూలవిరాట్‌కు, అమ్మవారి విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

పెనుమూరు : పులిగుండు శివాలయంలో వెలసిన పార్వతీపరమేశ్వరుల ఆలయంలో పౌర్ణమి వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. అర్చకులు స్వామికి అభిషేకాలు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సాయంత్రం స్వామిని శేషవాహనంపై అలంకరించి కొత్తరోడ్డు, రాణావేణుగోపాలపురం, సీఎస్. అగ్రహారం మీదుగా ఊరేగింపు నిర్వహిం చారు. వందలాది భక్తులు పాల్గొన్నారు. మధ్యాహ్నం, రాత్రి భక్తులకు అన్నదా నం చేశారు. నిర్వాహకులు షణ్ముగరెడ్డి, గోవిందరెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఐరాల(కాణిపాకం) : శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని సోమవారం కాణిపాకంలోని కల్యాణ వేదిక వద్ద వరసిద్ధుడి ఉత్సవర్లకు అర్చకులు అభిషేకం నిర్వహించారు. కాణిపాకానికి చెందిన రేపాకులక్ష్మమూర్తిశెట్టి, సోదరులు ఉభయదారులుగా వ్యవహరించారు. సాయంత్రం సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధుడి ఉత్సవ విగ్రహాలను కాణిపాకం పుర వీధులలో ఊరేగించారు. గ్రామస్థులు ఉత్సవ మూర్తులను దర్శించుకుని కాయ, కర్పూరం సమరించారు.

చిత్తూరు కల్చరల్ : గిరింపేట శ్రీవళ్లీ దేవసేన సమేత సుబ్రమణ్యేశ్వరాలయంలో సోమవారం శ్రావణపౌర్ణమి సందర్భంగా స్వామి అమ్మవార్లకు గిరిప్రదక్షణ వైభవంగా జరిగింది. స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మూలవర్లను ప్రత్యేక రథంపై అధిష్టించి సీబీరోడ్డు, దర్గా, పలమనేరు రోడ్డు, రాజీవ్‌గాంధీ రోడ్డు, గిరింపేటలలోగిరి ప్రదక్షణ నిర్వహించారు. ఆలయ ఈవో సుబ్బారెడ్డి, ఉత్సవ ధర్మకర్తలు పూలసుబ్రమణ్యంనాయుడు, ఎస్.టి. రంగనాథన్, భక్తులు పాల్గొన్నారు.

చిత్తూరు కల్చరల్ : నగరవాసులు సోమవారం రాఖీ పౌర్ణమిని ఆనందోత్సహాలతో జరుపుకొన్నారు.సోదరీమణులు తమ సోదరులకు నుదుట తిలకం దిద్ది, నోటిని తీపి చేసి, మంగళహారతులిచ్చి చేతులకు రక్షాబంధనాలు కట్టి ఆశీర్వాదాలు పొందారు. అనంతరం వారి సోదరులు తమ సోదరీమణులకు కానుకలు ఇచ్చి సంతృప్తి పర్చారు.

హత్యాచార ఘటనపై మహిళల నిరసన



ఎమ్మెల్యే సతీమణి గురజాల ప్రతిమ ఆధ్వర్యంలో నిరసన తెలుపుతున్న మహిళలు, రత్నం ఆస్పత్రి ఎదుట నిరసన తెలుపుతున్న వైద్య సిబ్బంది

చిత్తూరు (సెంట్రల్), ఆగస్టు 19: బెంగాల్‌లో డాక్టర్ హత్యాచార ఘటనను నిరసిస్తూ ఎమ్మెల్యే సతీమణి గురజాల ప్రతిమ ఆధ్వర్యంలో మహిళలు పెద్ద ఎత్తున కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ చేపట్టారు. సోమవారం రాత్రి గాంధీ విగ్రహం చేరుకున్న జనవిజ్ఞాన వేదిక సమతా విభాగం మహిళలు కూడలిలో కొవొత్తులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలకు రక్షణ కల్పించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పటిష్టమైన చట్టాలు తీసుకు వచ్చి అమలు చేయాలన్నారు. ఘటన పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. టీడీపీ నాయకురాలు వైవీ రాజేశ్వరీ, నగర మాజీ మేయర్ కఠారి హేమలత, బృందావన్ పాఠశాల కరస్పాండెంట్ శైలజాకుమారి, సమత విభాగం కన్వీనర్ జయంతి, జేవీవీ జిల్లా ఉపాధ్యక్షులు అరుణశివప్రసాద్, నగర అధ్యక్షులు సుధాకర్, నాయకులు వేణుగోపాల్, మహిళలు పాల్గొన్నారు.

బంగారుపాళ్యం : కలకత్తాలోని ఆస్పత్రిలో మహిళా డాక్టర్‌పై జరిగిన హత్యాచారాన్ని ఖండిస్తూ సోమవారం మండలకేంద్రంలోని రత్నం మెమోరియల్ ప్రైవేటు ఆస్పత్రి డాక్టర్లు, సిబ్బంది ఆస్పత్రి ఎదుట తమ నిరసన తెలిపారు. కోల్‌కత్తా వైద్య విద్యార్థిని కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు రామక్రిష్ణ, ఉదయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్యంతో చదువుకోవాలి


● సెల్‌కాన్ ఎండీ గురుస్వామినాయుడు



టెన్త్‌లో ఫస్ట్ వచ్చిన లక్ష్మీసుధ తరపున వారి తండ్రి భాస్కర్‌నాయుడుకు నగదు కవర్ అందజేస్తున్న గురుస్వామినాయుడు

గంగాధరనెల్లూరు, ఆగస్టు 19: భవిష్యత్తులో ఏంకావాలనేది లక్ష్యాన్ని విద్యార్థి దశలోనే పెట్టుకుని ముందుకు సాగితే తప్పకుండా ఆస్థాయికి చేరుకోవచ్చునని సెల్‌కాన్ మొబైల్స్ కంపెనీ, సెలెక్ట్ మొబైల్స్ స్టోర్స్ మేనేజింగ్ డైరక్టర్ ఎర్రగుంట్ల గురుస్వామినాయుడు అన్నారు. గంగాధరనెల్లూరు మండలం తూగుండ్రం హైస్కూల్లో 2023-24 విద్యాసంవత్సరంలో టెన్త్‌క్లాస్ పరీక్షల్లో ప్రతిభచూపిన విద్యార్థులకు సోమవారం నగదు పురస్కారాలను ప్రదానం చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. 567 మార్కులు సాధించిన లక్ష్మీసుధ తరపున తండ్రి భాస్కర్‌నాయుడుకు రూ.25వేలు నగదు, తేజస్వినికి రూ.15వేలు, పి.అక్షయకు రూ.10వేలు నగదు ప్రోత్సాహాన్ని అందజేశారు. తాను చదువుకున్న తూగుండ్రం హైస్కూల్లో విద్యార్థులను ప్రోత్సహించడానికి నగదు పురస్కారాలు ఇస్తున్నట్టు గురుస్వామినాయుడు తెలిపారు. ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ (ఐ.ఎఫ్.పీ) ద్వారా పలురాష్ట్రాల్లోని స్కూల్స్‌లో కొత్త విధానాన్ని తాము తీసుకొని రావడం జరిగిందన్నారు. ఏపీ ప్రభుత్వంతో మాట్లాడి 60వేలు హైస్కూల్స్‌లో ఐ.ఎఫ్.పీ విధానాన్ని అమలుచేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఆయ భార్య హేమావతి, కుమార్తె నికిత, సోదరుడు జిల్లా టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి, ఎర్రగుంట్ల కృష్ణమనాయుడు, చిత్తూరు బాలాజి మొబైల్స్ షాపు యాజమాని యంప్రాల వెంకటేశులునాయుడు పాల్గొని నగదు పురస్కారాల ప్రదానం చేశారు. ఇన్‌చార్జి హెచ్.ఎం. రాజేంద్ర నాయుడు, నరసింగరాయనిపేట హైస్కూల్ హెచ్.ఎం.రమేష్, తూగుండ్రం హైస్కూల్ విద్యాకమిటీ ఛైర్మన్ సుధాకరశెట్టి పాల్గొన్నారు.

సీఎంకు స్వాగతం పలికిన భానుప్రకాష్



నగరి ఆగస్టు19: శ్రీసిటీ పర్యటన కోసం సోమవారం తిరుపతి విమానాశ్రయంలో దిగిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబును ఎమ్మెల్యే భానుప్రకాష్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆయన వెంట చిత్తూరు పార్లమెంటరీ అధికార ప్రతినిధి చినబాబు తదితరులు ఉన్నారు.

కరకమాని గంగమ్మకు మహాకుంభాభిషేకం

శ్రీరంగరాజపురం, ఆగస్టు19: ఎస్ఆర్ పురం మండలం సింధూరాజపురంలో కరికమాని గంగమ్మ ఆలయం నిర్మించి సోమవారం శాస్త్రోక్తంగా మహాకుంభాభిషేకం నిర్వహించారు. పరిసర గ్రామాల భక్తులు హాజరయ్యారు. ఉభయదారులుగా చల్లంపాపయ్య, కుమార్ కుటుంబీకులు వ్యవహరించారు. కార్యక్రమంలో ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయ కమిటీ ఛైర్మన్ బాలాజీనాయుడు, చెంచుయాదవ్, ప్రకాష్‌యాదవ్, పారిశ్రామికవేత్త చెన్నై గంగాధరం, చంద్రయాదవ్, రాజేంద్రయాదవ్, చెంచుయాదవ్ పాల్గొన్నారు.

ఆర్‌డబ్ల్యూఎస్‌లో ఆడిట్

చిత్తూరు సిటీ, ఆగస్టు 19: జిల్లా కేంద్రంలోని ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో సోమవారం 2019-2024 కు సంబంధించి ఏపీ ఆడిట్ జనరల్ కార్యాలయ అధికారుల బృందం రికార్డులు పరిశీలించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మంజూరైన ప్రతి పనికి ఎన్ని నిధులు విడుదల చేశారు, ఏ మేరకు ఖర్చుచేశారు అనే వివరాలు పరిశీలిస్తున్నారు. మంగళవారం కూడా ఆడిట్ కొనసాగే అవకాశం ఉంది. ఆడిట్ పూర్తయిన తర్వాత పూర్తి వివరాలను అధికారులు వెల్లడించే అవకాశం ఉన్నట్లు సమాచారం.

పెనుమూరులో బైపాస్ రోడ్డు నిర్మించాలి

పెనుమూరు, ఆగస్టు 19: పెనుమూరులో బైపాస్‌రోడ్డు నిర్మించాలని, గత ప్రభుత్వంలో జరిగిన భూకబ్జాలపై విచారణ జరపాలని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎన్‌బీ పుధాకర్‌రెడ్డి సీఎం చంద్రబాబును కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన ముఖ్యమంత్రికి వినతిపత్రం పంపారు. పెనుమూరు మాస్టర్ ప్లాన్ రోడ్డును అమలు చేయాలని, అయితే ప్రముఖ వైసీపీ నేత అడ్డుపడుతున్నారని అన్నారు.

నేడు నగరంలో విద్యుత్ అంతరాయం

చిత్తూరు రూరల్, ఆగస్టు 19: నగరంలోని కొంగారెడ్డిపల్లి సెక్షన్ పరిధిలోని 11 కేవీ లైన్ మరమ్మతుల కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడనుందని చిత్తూరు ఆపరేషన్ డివిజన్ ఈఈ మునిచంద్ర తెలిపారు. గిరింపేట, ఆర్టీసీ 1డిపో, గంగనపల్లి, మిట్టూరు, ఆర్డీవో కార్యాలయ ప్రాంతం, కొండమిట్ట ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు.

క్షేత్రస్థాయిలో తిరిగి పనిచేయండి

గుడిపాల, ఆగస్టు 19: క్షేత్రస్థాయిలో తిరిగి ప్రజా సమస్యలు పరిష్కరించాలని తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి వీఆర్వోలకు సూచించారు. సోమవారం వీఆర్వోలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఒక వ్యక్తిని పలు మార్లు కార్యాలయాల చుట్టూ తిప్పిస్తే అధికారులకే చెడ్డపేరు వస్తుందన్నారు. ఈ-క్రాప్ బుకింగ్ వేగవంతం చేయాలని ఆదేశించారు. వ్యవసాయ అధికారిణి మాధవి, ఆర్ఐ మాధవి, వీఆర్వోలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

తవణంపల్లె, ఆగస్టు 19: పేకాట ఆడుతున్న వారిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. గాజులపల్లె సమీప మామిడి తోటలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం మేరకు ఆదివారం చిత్తూరు స్పెషల్ బ్రాంచ్ సీఐ మనోహర్, ఎస్ఐ అనిల్‌కుమార్, సిబ్బందితో దాడి చేసి 28 మందిని అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి ద్విచక్రవాహనాలు, సెల్ ఫోన్లు, రూ. 2,24,290 నగదును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి స్టేషన్‌కు తరలించి 41 నోటీసుల ఇచ్చినట్లు పోలీసులు తెలిపారు.

వెదురుకుప్పం ఎస్ఐగా వెంకటసుబ్బయ్య



వెదురుకుప్పం, ఆగస్టు 19: వెదురుకుప్పం ఎస్ఐగా వెంకటసుబ్బయ్య సోమవారం బాధ్యతలు చేపట్టారు. బదిలీల నేపథ్యంలో తిరుపతి జిల్లా తిరుచానూరు నుంచి టి.వెంకటసుబ్బయ్యను ఇక్కడికి పంపించారు.

గొడుగుచింతలో సమస్యల పరిష్కారానికి కృషి

వెదురుకుప్పం, ఆగస్టు 19: వెదురుకుప్పం మండలం గొడుగుచింత గ్రామంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని జనసేన పార్టీ జీడీ నెల్లూరు నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ యుగంధర్ పొన్న తెలిపారు. సోమవారం ఆ గ్రామంలో ఆయన ఇంటింటికీ వెళ్లారు. ఈ క్రమంలో అనారోగ్యంతో బాధపడుతున్న వారిని పలకరించారు. ఎన్టీఆర్ భరోసాకు అర్హులైన వారికి పెన్షన్ మంజూరుకు యంత్రాంగం చొరవ చూపాలన్నారు. ఆయన వెంట జనసైనికులు ఉన్నారు.



ఘనంగా రాఖీ పండుగ

పెనుమూరు/నగరి/చిత్తూరు సిటీ : రాఖీ పౌర్ణమిని పుర్కరించుకుని చిత్తూరు పార్లమెంటు మహిళా అధ్యక్షురాలు కార్జాల అరుణ మంత్రి నారా లోకేష్‌కు సోమవారం ఉండవల్లిలోని ఆయన నివాసంలో కలిసి రాఖీ కట్టింది. నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌కు తిరుపతిలోని ఆయన స్వగృహంలో నియోజకవర్గ తెలుగు మహిళలు రాఖీ కట్టారు. రాష్ట్ర తెలుగు మహిళా అధికార ప్రతినిధి మీరా, చిత్తూరు మహిళా కార్యదర్శి లక్ష్మీప్రసన్న, పుత్తూరు పట్టణ మహిళా కార్యదర్శి నాగరత్న, విజయపురం అధ్యక్షురాలు గుణభూషణమ్మ, మోహన, రజని తదితరులు పాల్గొన్నారు. చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌కు మాజీ మేయర్ కటారి హేమలత, తెలుగు మహిళలు రాణి, వరలక్ష్మి, శ్రీదుర్గ తదితరులు రాఖీ కట్టారు.